అనుమతి లేదు

సుండుపల్లె మండలం నుంచి ఇసుక రవాణాకు ఎటువంటి అనుమతి లేదు. స్థానిక అవసరాల నిమిత్తం ఇసుకను తరలించుకున్నట్లు తెలిసింది. బయటి ప్రాంతాలకు ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాము. ఎస్ఈబీ అధికారులకు సమాచారం ఇచ్చి సుండుపల్లెలో జరుగుతున్న ఇసుక రవాణాపై చర్యలు తీసుకునేలా చూస్తాను.

- మహబూబ్‌చాంద్, తహసీల్దార్, సుండుపల్లె

ఎప్పటికప్పుడు పరిష్కరించాలి: కలెక్టర్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులను పరిశీలించి సమస్యలను ఎప్పటికప్పుడు బాధ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ప్రజా సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలన్నారు. గాలివీడు మండలం యల్లంపల్లి గ్రామ నివాసి నూలివీడు శ్రీనివాసులు తన తల్లి కుర్రబోతుల రెడ్డెమ్మ 2024లో మరణించిందని, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ జారీ చేయించాలని కలెక్టర్‌కు దరఖాస్తును సమర్పించుకున్నారు. సదుం మండలం 79ఏ చింతమాకులపల్లి పంచాయతీ పరిధిలోని మటుకుపల్లికు చెందిన వై.వెంకట్రమణ తాను ఒంటరివాడినని, జీవనాధారం కోసం బియ్యం కార్డు, వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరాడు. టి.సుండుపల్లె మండలం పెద్దినేనికాలువ గ్రామ పంచాయతీ పరిధిలోని బండకాడ ఈడిగపల్లెకు చెందిన ఎస్.కార్తీక్ రేషన్‌కార్డు, వికలాంగుల పింఛన్ మంజూరు చేయాలని కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, ఎస్‌డీసీ రాఘవేంద్ర, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అలసత్వం ప్రదర్శించొద్దు : ఎస్పీ



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వస్తున్న ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం చేయవద్దని ఎస్పీ విద్యాసగర్‌నాయుడు జిల్లాలోని పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి పట్టణంలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి వారితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి బాధితులకు సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని, చట్ట పరిధిలో తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికలను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని ఆదేశించారు.

గంగమ్మ హుండీ ఆదాయం రూ.6.51 లక్షలు




హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

లక్కిరెడ్డిపల్లె, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): అనంతపురం గ్రామంలో వెలిసిన గంగమ్మ తల్లి హుండీ ఆదాయం రూ.6,51,480 ఆదాయం వచ్చినట్లు ఈవో శ్రీనివాసులు తెలిపారు. జిల్లా దేవాదాయ, ధర్మాదాయశాఖ పర్యవేక్షకులు విశ్వనాథ్ ఆధ్వర్యంలో సోమవారం హుండీలను లెక్కించారు. మార్చి నుంచి జూన్ నెలాఖరు వరకు హుండీల ద్వారా వచ్చిన ఆదాయాన్ని లెక్కించారు. లెక్కింపులో రాయచోటి బాలాజీ సేవా సమితి భక్తులు, బ్యాంకు, పోలీసు అధికారులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాహుదాను తోడేస్తున్నారు..!

- ఇష్టారాజ్యంగా ఇసుక తరలింపు
- అడుగంటుతున్న భూగర్భజలం



సుండుపల్లె, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): బాహుదా నదిని ఇసుకాసురులు తోడేస్తున్నారు. ఇసుక రీచ్‌కు అనుమతులు లేకున్నా స్థానిక అవసరాల మాటున ఇసుకను బయటి ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. సుండుపల్లెకు ఆనుకునే బాహుదా నది ప్రవహిస్తోంది. ఈ నదిలో ఇసుక పుష్కలంగా లభ్యమవుతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో కొంతమంది అధికార పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించిన వైసీపీ నాయకులను అడ్డం పెట్టుకుని పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఇసుకను సుదూర ప్రాంతాలకు తరలించారు. ఇసుక అక్రమంగా తరలిస్తున్నారని తెలిసినా కూడా అప్పట్లో అధికారులు కనీసం ఆపే ప్రయత్నాలు కూడా చేయలేదు. పైగా పోలీసులు, రెవెన్యూ అధికారులు మామూళ్ల మత్తులో ఊగిపోయారన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇసుకను స్థానిక అవసరాల నిమిత్తం గృహ నిర్మాణదారులకు, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, కార్యాలయాల నిర్మాణాల కోసం ఉచితంగా అందజేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇదే అదునుగా భావించిన ఈ ఇసుకాసురులు స్థానిక అవసరాల కోసమని ఇసుకను రాయచోటి, వీరబల్లి, కేవీ పల్లి, పీలేరు, భాకరాపేటతో పాటు సుదూర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రం నడిబొడ్డున ఉండే బాహుదానది నుంచి ఇసుకను తరలిస్తుంటే స్థానిక, మండల ప్రజల అవసరాల నిమిత్తం తరలిస్తున్నారా లేదా బయట ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారా అనేది కూడా పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

అడుగంటుతున్న భూగర్భజలం

బాహుదా నదిలో ఉన్న ఇసుకను అక్రమంగా తరలించడం వలన బాహుదా నది పరీవాహక ప్రాంతంలో సాగులో ఉన్న సుమారు 5 వేల ఎకరాల సాగు భూమికి నీటి కష్టాలు తప్పడం లేదు. ఝరికోన ప్రాజెక్టు పూర్తి స్థాయిలో వర్షపు నీటితో నిండితే ఆ నీరు మొరవ ద్వారా అరకొరగా బాహుదా నదిలో ప్రవహిస్తుంది. నదిలో ఇసుక ఉంటే తేమ శాతంతో భూగర్భ జలం పెరిగి వేసవిలో రైతులకు, ప్రజలకు సాగు, తాగునీటి సమస్యలు లేకుండా ఉండేది. అయితే ప్రస్తుతం ఇసుకను అక్రమంగా తరలించుకోవడం వలన ఇసుక మాయమై నదిలో మట్టి ఉండటంతో సాగునీటి సమస్యతో పాటు తాగునీటి సమస్య వస్తోందని స్థానిక రైతులు, ప్రజలు వాపోతున్నారు. నది నుంచి ఇసుక అక్రమ రవాణాను ఆపి మండల ప్రజల స్థానిక అవసరాల నిమిత్తం వినియోగించుకునేలా చేస్తే బాగుంటుందని ప్రజలు కోరుకుంటున్నారు.

పింఛాను అమ్మేస్తున్నారు

యర్రపురెడ్డి ఆదినారాయణరెడ్డి పింఛా ప్రాజెక్టు నుంచి అన్నమయ్య ప్రాజెక్టు వరకు పింఛా నది ప్రవహిస్తుంది. 2021వ సంవత్సరంలో తుఫాను కారణంగా ప్రాజెక్టు మట్టికట్ట తెగిపోయినప్పుడు ప్రాజెక్టు దిగువ భాగంలోకి పెద్ద మొత్తంలో ఇసుక దంపులుగా చేరింది. ఆ నది పరీవాహక ప్రాంతంలో ఉండే ప్రజలు, రైతులు అవసరాల నిమిత్తం ఈ ఇసుకను వినియోగించుకోవచ్చని అనుకున్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఈ ఇసుకను భారీగా తరలించారు.

ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలోనూ చిత్తూరు జిల్లాకు చెందిన వైసీపీ మాజీ మంత్రి పేరు చెప్పుకుని ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. పింఛా నది నుంచి నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లు సరిహద్దులు దాటిపోతున్నాయి. ఎవరైనా అధికారులకు సమాచారం ఇస్తే తూతూ మంత్రంగా దాడులు చేసి ఒకటి, రెండు కేసులు బనాయిస్తున్నారే తప్ప కఠిన చర్యలు తీసుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి.



బాహుదా నది నుంచి ట్రాక్టర్‌లో నింపుతున్న ఇసుక



బాహుదా నది నుంచి ట్రాక్టర్లలో తరలుతున్న ఇసుక



పింఛా నదిలో ఇసుక తరలించడంతో ఏర్పడిన గుంతలు

పనులు త్వరగా పూర్తి చేయాలి

- హంద్రీనీవా పనుల తనిఖీలో సీఈ శేషుబాబు



అధికారులతో మాట్లాడుతున్న సీఈ శేషుబాబు

పెద్దతిప్పసముద్రం/బి.కొత్తకోట జూన్ 30 (ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా కాలువ పనులను త్వరగా పూర్తి చేయాలని హంద్రీనీవా చీఫ్ ఇంజనీర్ శేషుబాబు అధికారులకు తెలిపారు. పెద్దతిప్పసముద్రం సమీపంలోని కొత్తపల్లె సమీపంలోని పంప్ హౌస్ వద్ద జరుగుతున్న హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి అధికారులతో మాట్లాడుతూ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి కాలువల ద్వారా నీటిని విడుదల చేసేందుకు పనులలో వేగం పెంచాలని, కాంట్రాక్టర్, అధికారులకు తెలిపారు. ఆయన వెంట ఎస్ఈ విఠలప్రసాద్, ఈఈ నీలకంఠతో పాటు హంద్రీనీవా అధికారులు పాల్గొన్నారు.

బి.కొత్తకోట మండలం మీదుగా ప్రవహించే హంద్రీనీవా కాలువకు జరుగుతున్న సిమెంట్ లైనింగ్ పనులను ఆయన కస్తూరిబా పాఠశాల వద్ద పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలని తెలిపారు.

ఒత్తిడి అధిగమించేందుకే శిక్షణ

రాయచోటిటౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఒత్తిడిని అధిగమించేందుకు స్టాఫ్ నర్సులకు శిక్షణ ఇస్తున్నట్లు ఎన్‌సీడీ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శివప్రతాప్‌నాయక్ తెలిపారు. సోమవారం రాయచోటి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రాయచోటి, రాజంపేట డివిజన్‌లలోని పీహెచ్‌సీలలో పనిచేస్తున్న స్టాఫ్ నర్సులకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమం ప్రారంభించారు. విధి నిర్వహణలో ఉన్న స్టాఫ్‌నర్సులు ఒత్తిడి అధిగమించేందుకుయోగాసనాలు వేయడం, కనీసం 8 గంటలు నిద్ర ఉండేలా చూసుకోవడం వంటివి చేయడం వల్ల ఒత్తిడి తగ్గి పని మీద ధ్యాస పెరుగుతుందన్నారు. ఫిజియోథెరపీలో పలు పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ట్రైనర్స్, స్టాఫ్ నర్సులు తదితరులు పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యత్తుకు బాట వేసుకోవాలి

- కష్టపడి చదివి ఉన్నత అవకాశాలు అందిపుచ్చుకోవాలి
- ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో అడ్మిషన్ కౌన్సెలింగ్
- మొదటి రోజు 481 మందికి అడ్మిషన్లు



ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో అడ్మిషన్‌కు వచ్చిన వారినుద్దేశించి మాట్లాడుతున్న డైరెక్టర్ కుమారస్వామి గుప్త

వేంపల్లె, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ట్రిపుల్‌ఐటీలో వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, క్రమశిక్షణ పట్టుదలతో కష్టపడి చదివి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కుమారస్వామి గుప్త విద్యార్థులకు ఉద్బోధించారు. వేంపల్లె మండలంలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో 2025-26 విద్యాసంవత్సరంలో ఆరు సంవత్సరాల సమీకృత ఇంజనీరింగ్‌కోర్సు కోసం దరఖాస్తు చేసుకున్న వేలాది మందిలో 1,060 మందికి సీటు దక్కింది. సోమవారం 587 మంది విద్యార్థులకు అడ్మిషన్ కల్పించేందుకు కాల్‌లెటర్లు పంపగా 481 మంది హాజరై అడ్మిషన్ పొందారు. సెంట్రల్ లైబ్రరీలో ఏర్పాటుచేసిన సమావేశంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులను ఉద్దేశించి డైరెక్టర్ గుప్త మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో చేరేందుకు వచ్చారని వీరిలో చాలావరకు గ్రామీణ ప్రాంత పేద కుటుంబాల వారే అన్నారు. ఇక్కడ సీటు రావడం అదృష్టంగా భావించి భవిష్యత్తుకు బంగారుబాటలు వేసుకోవాలని సలహా ఇచ్చారు. అనంతరం అత్యధిక మార్కులు సాధించిన అన్నమయ్య జిల్లా వీరబల్లి మండలం పెద్దవీడుకు చెందిన మేఘనకు మొదటి అడ్మిషన్, సత్యసాయి జిల్లా బుక్కపట్నంకు చెందిన హరీష్‌కు రెండవ అడ్మిషన్, కర్నూలు జిల్లా దేవరకొండ మండలం అలారుదిన్నెకు చెందిన మహేశ్వరికి మూడవ అడ్మిషన్ ఫైలును అందించారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి పెనుగొండ రవికుమార్, డీన్ కైలాష్ రమేష్, ఫైనాన్స్ అధికారి కోటేశ్వరి, కౌన్సెలింగ్ అధికారులు లింగమూర్తి, వెంకట్, రాఘవరెడ్డి, నవీన్, పవన్‌కుమార్, శ్రీకాంత్‌రెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హరీష్‌కు రెండో అడ్మిషన్ ఫైల్ అందిస్తున్న డైరెక్టర్ కుమారస్వామి గుప్త

తిరుమల నుంచి వస్తూ తిరిగిరాని లోకాలకు..

- చెన్నామర్రి మిట్ట వద్ద ఘోర రోడ్డు ప్రమాదం..
- కంటైనర్ - టెంపో ఢీకొని ముగ్గురు మృతి
- 12 మందికి తీవ్ర గాయాలు
- బెంగళూరు ఆసుపత్రికి 8 మంది తరలింపు



రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన టెంపో ట్రావెలర్



ప్రమాదంలో మృతి చెందిన మేఘర్స్, చరణ్, శ్రావణి (ఫైల్‌ఫొటోలు)

కురబలకోట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : తిరుమల శ్రీవారి దర్శనం చేసుకుని ఆనందంగా ఇళ్లకు వెళుతున్న వారిని రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. హైదరాబాద్-మదనపల్లె ప్రధాన జాతీయ రహదారిలోని చెన్నామర్రి మిట్ట వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా 12 మంది తీవ్రంగా గాయపడ్డ విషాదకర సంఘటన సోమవారం తెల్లవారుజామున జరిగింది. దీనికి సంబంధించి స్థానిక పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం బాగేపల్లికి చెందిన మూడు కుటుంబాలకు చెందిన నరసింహారెడ్డి, రామచంద్రప్ప, కొత్త ఉడియంకు చెందిన శివప్పలు స్నేహితులు. వీరు వ్యవసాయం, కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ మూడు కుటుంబాలకు చెందిన వారు రెండు రోజుల క్రితం తిరుమల స్వామి దర్శనానికి టెంపో ట్రావెలర్‌లో బయలుదేరి వెళ్లారు. స్వామి వారి దర్శనం అనంతరం తిరుమలలో ఆనందంగా గడిపిన వారు స్వగ్రామానికి ఆదివారం రాత్రి తిరుగుపయనమయ్యారు. సోమవారం తెల్లవారుజామున కురబలకోట మండలంలోని చెన్నామర్రి మిట్ట వద్ద ఎదురుగా వేగంగా వస్తున్న కంటైనర్ ఢీకొనడంతో టెంపో ట్రావెలర్ నుజ్జునుజ్జయింది. ప్రమాదంలో ముగ్గురి కుటుంబాలలో ఒక్కొక్కరు చొప్పున మేఘర్స్ (17), చరణ్ (17), శ్రావణి (24)లు అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదంలో నరసింహారెడ్డి (49), ఆయన భార్య రూపా (40), కుమారులు ఆదర్శ్ (20)లు, శివప్ప కుటుంబానికి చెందిన శివప్ప (45), ఆయన భార్య సునంద (36), చైత్ర (20), రామచంద్రప్ప కుటుంబానికి చెందిన రామచంద్రప్ప (53), ఆయన భార్య కళావతి (45), కుమారులు అశోక్ (30), దర్శన్ (19), హేమంత్ (13), డ్రైవర్ మంజునాథ్ (48)లు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు 108 సాయంతో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యచికిత్సలను అందించారు. కాగా వీరిలో మంజునాథ్, నరసింహారెడ్డి, శివప్ప, సునంద, ఆదర్శ్, రూపా, కళావతి, చైత్రల పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సలహా మేరకు బెంగళూరులోని వివిధ ఆసుపత్రులకు తరలించారు. సంఘటనా స్థలానికి డీఎస్పీ మహేంద్ర, సీఐ సత్యనారాయణలు చేరుకుని విచారించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కాగా మృతదేహాలను మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం వారి కుటుంబీకులకు అప్పగించారు. మృతుల, క్షతగాత్రుడి కుటుంబీకుల రోదనలు ఆసుపత్రిలో మిన్నంటాయి. ప్రమాదం కారణంగా రోడ్డుకు ఇరువైపులా వాహనాలు బారులు తీరి నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముదివేడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈ మేరకు ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కంటైనర్‌తో పరార్..

ప్రమాదానికి కారణమైన కంటైనర్‌ను ఆపకుండా డ్రైవర్ వెళ్లిపోయాడు. ప్రమాదంలో ముగ్గురి ప్రాణాలను పొట్టన బెట్టుకున్న కంటైనర్‌ను పట్టుకునే ప్రయత్నంలో పోలీసులు నిమగ్నమయ్యారు. కాగా కంటైనర్, ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను పట్టుకునేందుకు రెండు బృందాలను ఏర్పాటు చేశారు. కదిరి నుంచి పుంగనూరు వరకు సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. నిందితుడిని త్వరలోనే పట్టుకుంటామని డీఎస్పీ మహేంద్ర తెలిపారు.

మంత్రి మండిపల్లి పరామర్శ...

రోడ్డు ప్రమాదానికి సంబంధించి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కాగా దీనికి సంబంధించి ఫోన్‌లో పోలీసు అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి క్షతగ్రాత్రులకు మెరుగైన చికిత్సలు అందించాలని ఆదేశించారు.

పెరిగిన టమోటా ధర

- రూ.600 నుంచి రూ.800కు పెరిగిన 23 కేజీల బాక్సు
- ఆనందంలో రైతులు
- ములకలచెరువుకు పోటెత్తుతున్న టమోటాలు



ములకలచెరువు మార్కెట్‌కు భారీగా అమ్మకానికి వచ్చిన టమోటాలు

ములకలచెరువు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): టమోటా ధరలు పెరిగాయి. ములకలచెరువులో నిన్నటి వరకు రూ.600 పలికిన టమోటా ధర సోమవారం రూ.800కు చేరింది. ఎన్నడూ లేని విధంగా టమోటా ధరలు ఏకంగా 180 రోజులు (ఆరు నెలలు) పాటు పతనం కావడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కనీసం రవాణా, కోత విధించిన కూలీల ఖర్చు కూడా రాకపోవడంతో టమోటాలు కోయకుండా తోటల్లోనే వదిలేశారు. ఈ ప్రాంతంలో ఎక్కడ చూసినా తోటల్లో వదిలేసిన కాయలు దర్శనమిచ్చాయి. కేవలం 23 కేజీల బాక్సు ధర రూ.50 నుంచి రూ.150 వరకు మాత్రమే పలికాయి. ఈ క్రమంలో 15 రోజులుగా టమోటా ధరలు పెరుగుతూ వస్తున్నాయి. బాక్సు రూ.300 నుంచి పెరుగుతూ రూ.600లకు చేరింది. తాజాగా బాక్సు రూ.800లకు చేరింది. నాణ్యతను బట్టి రూ.500 నుంచి రూ.800 వరకు పలకడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడి నుంచి టమోటాలు ఢిల్లీ, గుజరాత్, వెస్ట్ బెంగాల్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలతో పాటు మన రాష్ట్రంలోని పలు పట్టణాలు, నగరాలకు ఎగుమతి అవుతున్నాయి. ములకలచెరువు మార్కెట్‌కు ప్రస్తుతం టమోటాలు పోటెత్తుతున్నాయి. 20 రోజుల క్రితం వరకు ఇక్కడి నుంచి కేవలం 10 లారీల లోపు కాయలు ఎగుమతి అయ్యేవి. వారం రోజుల నుంచి ప్రస్తుతం ప్రతిరోజూ 25 నుంచి 30 లారీల కాయలు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. టమోటాలు క్రయ, విక్రయాలు, టమోటాలు తీసుకొస్తున్న వాహనాలు, ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్న వాహనాలతో ములకలచెరువు మార్కెట్ యార్డు కిక్కిరిసిపోతోంది.

మదనపల్లె మార్కెట్‌లో కిలో రూ.35

మదనపల్లె టౌన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): టమోటా రైతులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ధరలు ఎట్టకేలకు నాలుగు నెలల తరువాత అమాంతం పెరిగాయి. సోమవారం మదనపల్లె మార్కెట్‌లో నాణ్యమైన టమోటా గరిష్ఠంగా కిలో రూ.35 వరకు ధరలు పెరిగాయి. మార్కెట్‌కు 1399 టన్నుల టమోటా విక్రయానికి రాగా కనిష్ఠ ధర రూ.20 పలుకగా, గరిష్ఠంగా కిలో రూ.35 వరకు ధర పలికాయి.

ప్రభుత్వం మారినా.. తగ్గేదేలే..!

● రోడ్డుకు అడ్డంగా రాళ్లు ● సీసీపల్లెలో వైసీపీ దౌర్జన్యం



దారికి అడ్డంగా వేసిన రాళ్లు

పెద్దతిప్పసముద్రం జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా.. గ్రామాల్లో వైసీపీ నాయకుల దౌర్జన్యాలు మాత్రం ఆగడం లేదనడానికి పులికల్లు పంచాయతీ చిన్న వెంకట్రామన్నగారిపల్లెలో సోమవారం జరిగిన ఉదంతం నిదర్శనంగా నిలుస్తోంది. సీవీ పల్లెకు చెందిన ముస్తాని రామమూర్తి తెలుగుదేశం పార్టీ సానుభూతిపరుడు. ఇదే గ్రామానికి చెందిన ముస్తాని చిన్నప్ప, ముస్తాని జయరాము కుటుంబాలతో ఇతనికి భూ వివాదం ఉంది. ఈ నేపథ్యంలో వారు వైసీపీ హయాంలో రామమూరిని ఇబ్బందులకు గురి చేశారు. అయినా, అతను స్పందించకపోవడంతో ఆదివారం అతని ఇం టికి వెళ్లే దారికి అడ్డుగా ట్రాక్టర్లతో బండరాళ్లు వేసి మూసేశారు. ఇదేమని ప్రశ్నిస్తే బెదిరిస్తున్నట్లు రామ్మూర్తి సోమవారం పెద్దతిప్పసముద్రం పోలీసులకు పిర్యాదు చేశాడు. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నా.. వైసీపీ నేతలకు భయపడి బతకాల్సిన పరిస్థితి గ్రామాల్లో ఉందని టీడీపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య

గుర్రంకొండ, జూన్ 3(ఆంధ్రజ్యోతి):ఆర్థిక సమస్యలు తాళలేక ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సంబేపల్లె మండలం నారాయణరెడ్డిగారిపల్లె పంచాయతీ కొండావాండ్లపల్లెకు చెందిన శ్రీనివాసులరెడ్డి (52)కి భార్య ఇద్దరు కుమార్తెలున్నారు. వ్యవసాయం కోసం అప్పులు చేశాడు. ఈ మధ్యకాలంలో కుమార్తెలిద్దరికి వివాహం చేయడంతో అప్పుల భారం మరింతగా పెరిగింది. దీంతో తీవ్ర ఒత్తిడికి లోనై ఈ నెల 27న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. చెర్లోపల్లె పంచాయతీ సూరప్పగారిపల్లె హంద్రీ-నీవా కాలువ సమీపంలో ఓ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు సోమవారం సమాచారం అందించడంతో అక్కడికి చేరుకొన్న పోలీసులు మృతుడు శ్రీనివాసులరెడ్డిగా గుర్తించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

రైల్వేకోడూరు రూరల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): కడప చెన్నై ప్రధాన రహదారిలోని ఎస్.ఉప్పరపల్లి వద్ద సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కడప జిల్లా ఎర్రగుంట్లకు చెందిన బత్తల గోపాల్ (21) చెన్నై మున్సిపాలిటీలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. అనారోగ్యంతో ఉన్న తన పెద్దనాన్నను పరామర్శించేందుకు చెన్నై నుంచి ఎర్రగుంట్లకు మోటారుబైకుపై వస్తుండగా ఉప్పరపల్లి వద్ద హైదరాబాద్ నుంచి పాండిచ్చేరి వెళుతున్న ప్రైవేట్ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

యూఎస్ఏలో మృతి.. గోపిదిన్నెలో అంత్యక్రియలు

తంబళ్లపల్లె, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న యూఎస్ఏలోని వాటర్‌ఫాల్స్ వద్ద జరిగిన ప్రమాదంలో మృతి చెందిన వెంకట జవహర్‌రెడ్డి(30)కి సోమవారం ఆయన స్వగ్రామం గోపిదిన్నెలో అంత్యక్రియలు నిర్వహించారు. మండలం గోపిదిన్నెకు చెందిన సప్తగిరి గ్రామీణ బ్యాంకు రిటైర్డు మేనేజరు రమేష్‌రెడ్డి కుమారుడు వెంకట్ జవహర్‌రెడ్డి అక్క లాస్యతో కలసి యూఎస్ఏలో ఉద్యోగం చేస్తున్నాడు ఈ నెల 21 న యూఎస్ఏలోని వాటర్‌ఫాల్స్ వద్ద జరిగిన ప్రమాదంలో మృతి చెందాడు. సోమవారం మృతదేహం స్వగ్రామం చేరుకోగా అశ్రు నయనాల నడుమ అంత్యక్రియలు నిర్వహించారు.

డ్రోన్లతో వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు

● 80 శాతం రాయితీపై పంపిణీ
● జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ



డ్రోన్‌ను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి

సుండుపల్లె, జూన్ 30(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో అత్యాధునిక మార్పులు తీసుకువచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివనారాయణ తెలిపారు. సోమవారం సుండుపల్లె మండలంలోని సుండుపల్లె-3 రైతు సేవా కేంద్రంలో రూ.9,80,000 లక్షలు విలువ చేసే కిసాన్ డ్రోన్‌ను 80 శాతం రాయితీతో శ్రీగణేశ్ డ్రోన్ రైతు మిత్ర సంఘం సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రానికి చెందిన డ్వాక్రా మహిళలు ఈ డ్రోన్‌ను కొనుగోలు చేశారన్నారు. ఈ డ్రోన్ సహ కారంతో క్రిమిసంహారక మందుల పిచికారీ సులభతరమవుతుందన్నారు. దీని వినియోగంతో సమయం, శ్రమ ఆదా అవుతాయన్నారు. డ్రోన్ నిర్వహణకు ప్రభుత్వం ఒకరికి శిక్షణ ఇస్తోందని తెలిపారు. అనంతరం రైతు మిత్ర సేవా సంఘం సభ్యులు, రైతులు, వ్యవసాయసిబ్బంది సమక్షంలో డ్రోన్ పనితీరును పరిశీలించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాయచోటి సహాయ సంచాలకులు శ్రీలత, కెనరా బ్యాంకు మేనేజర్ మస్తాన్, టీడీపీ పార్లమెంటు వాణిజ్య విభాగం నాయకులు దామోదర్‌నాయుడు, వ్యవసాయశాఖ అధికారి మహబూబ్‌బాషా, వ్యవసాయ శాఖ సిబ్బంది ముకుందర్, రెడ్డినాయక్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ ఆస్తుల పరిరక్షణే లక్ష్యం

● వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు పురం రామ్మూర్తి

పీలేరు రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ కమిటీ ఆస్తుల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు పురం రామ్మూర్తి తెలిపారు. సోమవారం ఆయన పీలేరు మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కేవీపల్లె మండలం గురుకుల పాఠశాల సమీపంలో రూ. 20 కోట్ల విలువైన 6.29 ఎకరాలు, తిరుపతి మార్గంలోని ఆయిల్ సీడ్స్ వద్ద రూ. 6 కోట్ల విలువైన రెండు ఎకరాలు, మండలంలోని యర్రగుంటపల్లె పంచాయతీ పరిధిలోని నెట్టిబండ వద్ద 10 ఎకరాల భూమి ఉందన్నారు. ఈ భూములు ఆక్రమణల బారిన పడకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే కేవీపల్లెలోని స్థలాన్ని పరిశీలించి సర్వేయించామన్నారు. ఆయా భూములు అన్యాక్రాంతం కాకుండా ప్రహరీగోడ నిర్మించడం లేదా చుట్టూ రాతి కూసాలు నాటించి ఇనుప కంచె వేస్తామన్నారు. పీలేరు సీఎల్ఆర్‌సీ కార్యాలయం పక్కన ఉన్న 46 సెంట్ల స్థలంలో రూ. 26 లక్షలతో రైతు బజారు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు పంపామన్నారు. పట్టణం మధ్యలో రైతు బజారు ఏర్పాటుతో అందరికీ సౌకర్యంగా ఉంటుందన్నారు. త్వరలోనే రైతు బజారు పనులు ప్రారంభిస్తామని తెలిపారు. జూలై 2న పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మొదటి సమావేశం నిర్వహిస్తు న్నామని, ఇందులో ఆస్తుల పరిరక్షణపై చర్చించి తదనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. మార్కెట్ యార్డు ఆవరణలో రైతులకు వసతుల కల్పనకు ప్రణాళిక రూపొందిచామన్నారు. పీలేరు ఎమ్మెల్యే సహకారంతో వనరులను సద్వినియోగం చేసుకొని మార్కెట్ కమిటీని అభివృద్ధి పథంలో నడిపిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోళ్ల కిషోర్ నాయుడు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీఎల్వోల శిక్షణకు ట్రైనర్ల ఎంపిక

● రెండు రోజుల పాటు ఢిల్లీలో శిక్షణ
● ఎంపికైన వారికి కౌన్సెలింగ్ నుంచి మినహాయింపు

కలికిరి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాలో సవరణలు, మార్పులు, చేర్పులు తదితర ప్రక్రియలు చేసే బూత్ లెవెల్ అధికారుల శిక్షణకు ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం గతంలో మంచి పనితీరు కనబరిచిన బీఎల్వోల్లో కొందరిని ఎంపిక చేసి ఈ నెల మూడవ తేదీ నుంచి రెండు రోజులపాటు ప్రత్యేక శిక్షణ ఇవ్వనుంది. ఇలా శిక్షణ పొందిన వారు నియోజకవర్గాల్లోని అన్ని మండలాలకు చెందిన బీఎల్వోలకు శిక్షణ ఇవ్వనున్నారు. ప్రతి జిల్లాకుఒక బీఎల్వో సూపర్‌వైజరును కూడా ఎంపిక చేసింది గురువారం నుంచి ఈ శిక్షణ ప్రారంభ మవుతోంది. కాగా, రెండవ బ్యాచ్‌లో కడప, అన్నమయ్య జిల్లాల్లోని 12 నియోజకవర్గాల నుంచి ఒక్కొక్కరిని ఎంపిక చేసి ఢిల్లీకి పంపుతున్నారు. వీరందరికీ మూడవ తరగతి ఏసీ సీట్లు రిజర్వు చేయడంతోపాటు, సోమవారం అందరినీ రిలీవ్ చేసి ఢిల్లీకి పంపే ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం సీఈవో వివేక్ యాదవ్ కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. శిక్షణకు వెళుతున్న వారి వివరాలు ఇలా వున్నాయి. రెండవ బ్యాచ్‌లో మొత్తం ఏడుగురు ఈఆర్వోలను ఎంపిక చేయగా అందులో కడప జిల్లా పులివెందుల నియోజకవర్గం ఈఆర్వో జి.చిన్నయ్య (కడప జీఎస్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు)ఉన్నారు. ఇక అన్నమయ్య జిల్లా పీలేరు నియోజకవర్గం కలికిరి మండలం చీకటిపల్లె వీఆర్వో బి.సరేష్‌కుమార్, మదనపల్లె నుంచి వార్డు ప్రణాళిక కార్యదర్శి డి.హరికుమార్ రెడ్డి, తంబళ్లపల్లె నుంచి వీఆర్వో మహ్మద్ నవాజ్, రాయచోటి నుంచి బీఎల్వో సూపర్‌వైజర్‌గా ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు పి.నరసింహ కుమార్, రైల్వే కోడూరు నుంచి వీఆర్వో ఎస్.ముజీబ్, రాజంపేట నుంచి వీఆర్వో శివరాజ ఎంపికయ్యారు. ఇక కడప నియోజకవర్గం నుంచి బీఎల్వో సూపర్‌వైజర్ (వార్డు కార్యదర్శి) ఏ.చిన్నవేమయ్య, బద్వేలు నుంచి వీఆర్వో ఎం.సతీష్‌చంద్రన్ రెడ్డి, పులివెందుల నుంచి వార్డు రెవెన్యూ కార్యదర్శి పి.శ్రీనివాసులు రెడ్డి, కమలాపురం నుంచి డిజిటల్ అసిస్టెంట్ కె.కైలాస్‌కుమార్ రెడ్డి, జమ్మలమడుగు నుంచి వీఆర్వో ఏ.చిన్ననాగన్న, ప్రొద్దుటూరు నుంచి వార్డు రెవెన్యూ కార్యదర్శి బి.ఆంజనేయులు, మైదుకూరు నుంచి వార్డు రెవెన్యూ కార్యదర్శి బి.రామాంజనేయులును ఎంపిక చేసింది. సోమవారం వీరంతా ఢిల్లీకి వెళ్లారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

రాజంపేట టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 5న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు మూడవ అదనపు జిల్లా జడ్జి ఎస్.ప్రవీణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షిదారులు తమ సమస్యలను రాజీ చేసుకునేందుకు లోక్‌అదాలత్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్‌జడ్జి టి.కేశవ, జూనియర్ సివిల్ జడ్జి పి.రాజన్ ఉదయ్‌ప్రకాష్‌లు పాల్గొన్నారు.

ఎస్సీ మానిటరింగ్ సమావేశాలపై చిన్నచూపు

● అధికారులను ప్రశ్నించిన దళిత నేతలు



సమావేశంలో అధికారులను నిలదీస్తున్న దళిత నేతలు

నిమ్మనపల్లి జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ సమావేశాలు అంటే అధికారులకు చిన్నచూపు ఎందుకని దళిత నేతలు మునిరత్నం, యర్రయ్య అధికారులను ప్రశ్నించారు. సోమవారం తవళం పంచాయతీ దళితవాడలో పౌరహక్కుల పరిరక్షణపై నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతి నెలా సమావేశాలు నిర్వహిస్తున్నా దళితులకు చెందిన ఒక్క అర్జీని కూడా పరిష్కరించలేదన్నారు. అలాంటప్పుడు సమావేశాలు ఎందుకని అధికారులను నిలదీశారు. మాజీ సర్పంచ్ రెడ్డెప్ప మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ కింద కేవలం తొమ్మిది యూనిట్లు కేటాయింపులో తీవ్ర అన్యాయం చేశారన్నారు. విద్యుత్ అధికారులైతే ఒక్క సమావేశానికి కూడా హాజరు కాలేదని, సెలవు పేరుతో తహసీల్దార్ తపస్విని గైర్హాజరు సరైంది కాదన్నారు. సీఎస్‌డీటీ సిరాజ్ మాట్లాడుతూ ప్రతి నెలా ఒక గ్రామంలో సివిల్ రైట్స్ సమావేశం నిర్వహించి దళితవాడల్లో నెలకొన్న సమస్యలను కలెక్టర్ దృషికి తీసుకెళతున్నామని తెలిపారు. సమవేశానికి హాజరు కాని మండల అధికారులకు వెంటనే నోటీసులు జారీ చేస్తామన్నారు. ఏఓ రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మిధున్‌చక్రవర్తి, సర్వేయర్ గోపి, ఏపిఎమ్ మురళి, ఏపీఓ రమేష్, కార్యదర్శి గౌతమి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు రూ.3.40 లక్షలు విరాళం



ట్రస్టు సభ్యులకు చెక్కును అందచేస్తున్న రామకృష్ణారెడ్డి

తంబళ్లపల్లె, జూన్ 30(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లెకు సమీపంలోని మల్లయ్యకొండ మల్లికార్జున స్వామి అన్నదాన ట్రస్ట్ వంట షెడ్ నిర్మాణానికి కన్నెమడుగుకు చెందిన రామకృష్ణారెడ్డి, రవిశంకర్‌రెడ్డి రూ.3.40 లక్షల చెక్కును విరాళంగా అందజేశారు. ఆదివారం సాయంత్రం అన్నదాన ట్రస్టు చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, ట్రస్టు సభ్యులకు దాతలు చెక్కును అందజేశారు. ప్రతి ఏడాది మహాశివరాత్రి రోజున మల్లయ్యకొండకు వచ్చే భక్తులకు ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదానం చేస్తున్నారు. ఈ మొత్తాన్ని వంట షెడ్డు నిర్మాణానికి వినియోగించనున్నట్లు సభ్యులు తెలిపారు. ట్రస్టు సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, రామ్మూర్తి, కరీం, నారాయణరెడ్డి, రమణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, జయనారాయణరెడ్డి, నరసింహా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఏఈఈపై విచారణకు అధికారి నియామకం

కలికిరి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కురబలకోట మండలం అంగళ్లు ఏఈఈ బరిణేపల్లె వెంకటరత్నంపై విచారణకు సహక రించేందుకు కడప రేంజ్ ఏసీబీ ఇన్‌స్పెక్టర్ ఎన్.వి. నాగరాజును నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఆదేశాలు జారీ చేసింది. గత ఏడాది ఏప్రిల్ 30న ఏఈఈ వెంకటరత్నం లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు. ఈ వ్యవహారంపై విచారణ చేయాలని ఏసీబీ డైరెక్టర్ జనరల్ ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ఈ క్రమంలో విచారణాధికారి ముందు వెంకటరత్నంపై మోపిన అభియోగాలకు సంబంధించిన ఆధారాలను విచారణాధికారికి అందజేసి సహకరించాల్సి ఉంది దీని కోసం ఏసీబీ ఇన్‌స్పెక్టరు నాగరాజుకు ఈ బాధ్యతలు అప్పగించారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

లుంగీ కట్టు.. మాస్ లుక్!



కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా జంటగా జైన్స్ నాని తెరకెక్కిస్తోన్న చిత్రం 'కె-ర్యాంప్'. హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బేనర్లపై రాజేశ్ దండా, శివ బొమ్మకు నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. కిరణ్ అబ్బవరం లుంగీ కట్టులో మాస్, క్లాస్ కలసిన మేకోవర్‌లో ఆకట్టుకుంటున్నారు. బ్యాక్ గ్రౌండ్‌లో మందు బాటిల్స్‌తో డిజైన్ చేసిన లవ్ సింబల్ కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఈ దీపావళికి విడుదల చేసేందుకు చిత్రబృందం సిద్ధమవుతోంది.

ఓటీటీలోకి 'తల్లి మనసు'



కమల్ కామరాజు, సాత్విక్, రచిత మహాలక్ష్మీ ప్రధాన పాత్రల్లో ముత్యాల సుబ్బయ్య తెరకెక్కించిన చిత్రం 'తల్లి మనసు'. ముత్యాల అనంత కిశోర్ నిర్మించారు. ఇటీవలె చిత్రం విడుదలైంది. తాజాగా, ఈ సినిమా ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్‌లోకి అందుబాటులోకి వచ్చిందని మేకర్స్ తెలిపారు.



పూజతో ప్రారంభం

తమిళ నటుడు విజయ్ సేతుపతి కథానాయకుడిగా పూరి జగన్నాథ్ ఓ చిత్రాన్ని తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. సోమవారం ఈ చిత్రాన్ని పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు మేకర్స్. విజయ్‌కుమార్, సంయుక్త, టబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఛార్మీ కౌర్ సమర్పణలో పూరి జగన్నాథ్, జేబీ నారాయణరావు కొండ్రోల్లా సంయుక్తంగా సినిమాను నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ప్రేక్షకులకు విభిన్నమైన అనుభూతిని ఈ సినిమా ద్వారా అందిస్తామని మేకర్స్ పేర్కొన్నారు. ఈ నెల నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుంది.

సున్నితమైన హాస్యంతో...



హీరో రాణా దగ్గుబాటి తన నిర్మాణ సంస్థ స్పిరిట్ మీడియా బ్యానర్‌పై రూపొందిస్తున్న చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. నూతన దర్శకురాలు ప్రవీణ పరుచూరి తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా గురించి మేకర్స్ మాట్లాడుతూ "సున్నితమైన హాస్యంతో నిండిన చిత్రమిది. అందర్నీ ఆలోచింపజేస్తుంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది" అని తెలిపారు. ప్రస్తుతం ఈ చిత్రం నిర్మాణ దశలో ఉంది.

కథలో భిన్న కోణాలుంటాయి

- శ్రీరామ్ వేణు



"తమ్ముడు' సినిమాలో కుటుంబ భావోద్వేగాలు, భిన్న కోణాలు ఉంటాయి. ట్రైలర్‌లో కథ ఎలా ఉండబోతుందో చెప్పాం' అని అన్నారు దర్శకుడు శ్రీరామ్ వేణు. నితిన్ హీరోగా ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'తమ్ముడు'. దిల్ రాజు, శిరీష్ నిర్మించారు. ఈ శుక్రవారం థియేటర్లలో విడుదలవుతున్న సందర్భంగా శ్రీరామ్ వేణు మీడియాతో మాట్లాడుతూ 'ఈ చిత్రానికి సెన్సార్ వాళ్లు కొన్ని కట్స్ చెప్పారు. మేము ఆ కట్స్ వద్దనుకున్నాం. సినిమాలో హీరోతోపాటు ఐదుగురు మహిళా క్యారెక్టర్లు బలంగా ఉంటాయి. 'విక్రమ్'లో కమల్ హాసన్ పాత్ర కథలో ఎలా ట్రావెల్ అవుతుందో అలా ఈ చిత్రంలోనూ ఉంటుంది. ఆర్చరీని కథలో చేర్చాలని చాలా సార్లు అనుకున్నాం. 'తమ్ముడు'లో కుదిరింది. ఆర్చరీ ట్రైనర్‌తో నితిన్‌కు 15 రోజులు శిక్షణ ఇప్పించాం. కథలో ప్రధానంగా బ్రదర్ సిస్టర్ సెంటిమెంట్ ఉన్నా అనేక కోణాల్లో మూవీ సాగుతుంది. 'కాంతారా' చూశాక సప్తమి గౌడ మా మూవీలోని క్యారెక్టర్‌కు బాగుంటుందని అనిపించి తీసుకున్నాం. మ్యూజిక్ డైరెక్టర్ అజనీష్ లోకనాథ్ మంచి బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఇచ్చారు.

ఓ దినపత్రికలో వచ్చిన ఆర్టికల్ స్ఫూర్తితో 'తమ్ముడు' కథను సిద్ధం చేసుకున్నా. కథ విని దిల్‌రాజు గారు బడ్జెట్ గురించి ఆలోచించకుండా నిర్మించారు. ఈ కథకు సరిపోయే హీరో కోసం వెతికాం. నితిన్ బాగుంటాడని తీసుకున్నాం. లయ పాత్ర కోసం ఒకప్పటి స్టార్ హీరోయిన్‌కి కథ చెప్పాం. ఆమెకు కథ, క్యారెక్టర్ నచ్చింది. కానీ ఆమె వ్యక్తిగత కారణాల వల్ల నటించలేదు. అయితే మరోసారి ఇలాంటి క్యారెక్టర్ వస్తే తప్పకుండా నటిస్తానని చెప్పారు. నా ప్రతి సినిమా ఒక కొత్త జానర్‌లో ఉంటుంది. నేనెప్పుడూ జానర్ రిపీట్ చేయలేదు. నా స్క్రిప్ట్‌లో ఫిమేల్ క్యారెక్టర్లకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ఇప్పటి దాకా అలా చేస్తూ వచ్చాను. తరవాత సినిమాకు ఎలా ఉంటుందో ఇప్పుడే చెప్పలేను' అని అన్నారు.

అల్లరి నరేశ్ 'ఆల్కహాల్'



హాస్య చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్న అల్లరి నరేశ్, వైవిధ్యభరితమైన చిత్రాలతోనూ తన దైన ముద్ర వేస్తున్నారు. అదే కోవలో మరో వైవిధ్యమైన చిత్రంతో అలరించడం కోసం సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో చేతులు కలిపారు. 'ఫ్యామిలీ డ్రామా' ఫేమ్ మెహర్ తేజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు 'ఆల్కహాల్' అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్ ఆకట్టుకుంటోంది. కాగా, అల్లరి నరేశ్ సరసన రుహాని శర్మ కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడించనున్నట్లు చిత్రబృందం పేర్కొంది.

సీనియర్ అసిస్టెంట్‌కు ఏవోగా పదోన్నతి


ఆర్డర్ కాపీని తీసుకుంటున్న పద్మావతి

కడప రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కొనిజేటి పద్మావతికి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(ఏవో)గా పదోన్నతి కల్పించారు. ఈ మేరకు ఆమెను బద్వేల్ పీఐయూ డివిజన్‌కు ఏవోగా నియమిస్తూ ప్లేస్ పోస్టింగ్ ఆర్డర్‌ను ఇచ్చారు. జూలై 1 మంగళవారం ఆమె ఏవోగా బాధ్యతలను చేపట్టనున్నారు. ఈ సందర్భంగా పరిపాలన విభాగం ఏవో భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను అనుసరించి సీనియారిటీ ప్రకారం జడ్పీ సీఈవో సి.ఓబులమ్మ అర్హులైన వారికి పదోన్నతులు కల్పిస్తున్నారన్నారు. సీఈవో ఆదేశాల మేరకు ఏవోగా పదోన్నతి పొందిన పద్మావతికి సోమవారం ఆర్డర్ కాపీని అందజేశామన్నారు. ఏపీపీఆర్ ఎంఈఏ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లంకామల్లేశ్వరెడ్డి, శ్రీనివాసులరెడ్డిలు అర్హత కలిగిన ఉద్యోగులకు సకాలంలో పదోన్నతులు కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రం, దేశాభివృద్ధి

● ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి

వేంపల్లె, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రానికి చెందిన ప్రాంతీయ పార్టీలు టీడీపీ, వైసీపీ, జనసేనలు బీజేపీ చేతిలో కీలు బొమ్మలు అని తెలిపారు. ప్రధాని మోదీ, బీజేపీ నాయకులు, సీఎం చంద్రబాబు పదేపదే ఎమర్జెన్సీ గురించి ప్రస్తావించడం, ఆ సాకుతో కాంగ్రెస్‌ను విమర్శించడం గర్హనీయమన్నారు. 1977లో ఎమర్జెన్సీ సమయంలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 42 స్థానాలకు గానూ 41 స్థానాల్లో తెలుగు ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించారని, ఎమర్జెన్సీని ఎత్తివేసిన తర్వాత 1978లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 294 స్థానాలకు గానూ 175 స్థానాల్లో గెలిచిందన్నారు. దేశంలో పరిస్థితులు బాగలేని కారణంగా రాజ్యాంగంలోని 352 అధికరణ ప్రకారం రాజ్యాంగబద్ధంగా ఇందిరమ్మ ఎమర్జెన్సీని ప్రకటించిందని, పరిస్థితులు చక్కబడగానే ఎమర్జెన్సీని ఎత్తివేసినట్లు తెలిపారు.

పనికి సమాన వేతనం ఇప్పించాలి

● మంత్రి పార్థసారధికి ట్రిపుల్‌ఐటీ గెస్ట్ ఫ్యాకల్టీ వినతి


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఫ్యాకల్టీలు

వేంపల్లె, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గెస్ట్ ఫ్యాకల్టీగా 2018లో చేరాం, ట్రిపుల్‌ఐటీలో ఎన్నో ఇబ్బందులు పెట్టారు. రెండేళ్లు తిరగకుండానే టీడీపీ ప్రభుత్వంలో చేరామనే అక్కసుతో తొలగించారు. కోర్టుకు పోయి మళ్లీ విధుల్లో చేరాం. పనికితగ్గ వేతనం ఇవ్వకుండా అన్యాయం చేశారు. కూటమి ప్రభుత్వంలోనైనా న్యాయం చేయాలని మంత్రి పార్థసారధికి ఆర్జీయూకేటీ గెస్ట్ ఫ్యాకల్టీ విజ్ఞప్తి చేశారు. విజయవాడలో ఉన్న మంత్రిని అసోసియేషన్ అధ్యక్షుడు నజీర్ హుస్సేన్, ఉపాధ్యక్షుడు మణికుమార్ తదితర ఫ్యాకల్టీ కలిసి వినతిపత్రం ఇచ్చారు. తమ తర్వాత చేరిన అధ్యాపకులకు రూ.33 వేలు వేతనం ఇస్తుండగా తమకు మాత్రం రూ.25వేలు మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. నెట్, సెట్ కోర్సుల సాకు చూపుతూ ఇంతవరకు అన్యాయం చేశారని తెలిపారు. ప్రభుత్వం 110 జీఓ ఇచ్చినప్పటికీ అమలు చేయలేదని, ఇప్పటికైనా న్యాయం జరిగేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రికి విన్నవించారు.

సుపరిపాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

● మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ బచ్చల పుల్లయ్య

ప్రొద్దుటూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏడాది కాలంగా అందిస్తున్న సుపరిపాలనను క్లస్టర్, యూనిట్ బూత్ ఇన్‌చార్జులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ బచ్చల పుల్లయ్య పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం స్థానిక భారత ఫంక్షన్ హాలులో నియోజకవర్గ స్థాయిలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను నెరవేర్చామని ప్రజలకు తెలియజెప్పాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఈవీ సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, టౌన్‌బ్యాంకు చైర్మన్ సుబ్బారెడ్డి, రాష్ట్ర వాల్మీకి బోయ కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజు, కేసీ కెనాల్ ప్రాజెక్టు వైస్ చైర్మన్ గురివిరెడ్డి, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలి

ప్రొద్దుటూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మహిళా సంరక్షణ కార్యదర్శుల బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలని ఆ సంస్థ అధ్యక్షురాలు అపర్ణ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం గాంధీ విగ్రహం వద్ద హోంమంత్రి అనిత చిత్రపటం వద్ద మహిళ సంరక్షణ కార్యదర్శులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా అపర్ణ మాట్లాడుతూ ప్రైవేటు ఉద్యోగులకు స్పౌజ్ కోటా వర్తింపజేసి 30 శాతం మందికి కౌన్సెలింగ్‌లో అధికారులు తీవ్ర అన్యాయం చేశారని విమర్శించారు. హోంమంత్రి అనిత జోక్యం చేసుకొని న్యాయం చేయాలని కోరారు.

అక్రమ కట్టడాన్ని అడ్డుకున్న అధికారులు

సీకేదిన్నె, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మామిళ్లపల్లె పంచాయతీలోని సర్వే నంబరు 39లో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను ప్రభుత్వ అధికారులు అడ్డుకున్నారు. బాబానగర్‌లో సోమవారం అక్రమ కట్టడాలు జరుగుతున్న విషయాన్ని స్థానికులు 'ఆంధ్రజ్యోతి' దృష్టికి తెచ్చారు. వెంటనే అక్రమ నిర్మాణాల సమాచారాన్ని తహసీల్దారు నాగేశ్వరరావు దృష్టికి తీసుకుపోవడంతో ఆయన వీఆర్వోను ఘటనా స్థలానికి పంపి అడ్డుకున్నారు. అదే విధంగా ఊటుకూరు పంచాయతీలోని సర్వే నంబరు 258 ఆక్రమణకు గురవుతున్న విషయాన్ని కూడా తహసీల్దారు దృష్టికి తేవడంతో వీఆర్వోను పంపించి జరిగిన విషయంపై ఆరా తీశారు.

శివారెడ్డి మరణం తీరని లోటు : సీపీఐ


శివారెడ్డికి నివాళులర్పిస్తున్న సంఘాల నేతలు

కడప సెవెన్‌రోడ్స్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సామాజిక కార్యకర్త పుత్తా శివారెడ్డి (65) ఆకస్మిక మరణం పౌర సమాజానికి తీరని లోటని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర అన్నారు. సోమవారం ఉదయం గుండెపోటుతో ఆకస్మికంగా మరణించడం పలువురిని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. బాలాజీనగర్‌లో వారి స్వగృహం వద్ద ఉన్న శివారెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి జిల్లా వ్యాప్తంగా పలువురు ఘనంగా నివాళులర్పించారు. పలువురు నాయకులు, అభిమానులు ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. కాగా శివారెడ్డి మృతదేహాన్ని పరీక్షల నిమిత్తం రిమ్స్‌కు అప్పగించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, నగర కార్యదర్శి ఎన్.వెంకటశివ, సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, హేతువాద సంఘం నాయకులు సీఆర్‌వీ ప్రసాద్, నాగార్జునరెడ్డి, విరసం, ప్రజానాట్య మండలి, నాస్తిక సంఘం, లోక్‌సత్తా, ఆప్ నేత, రాయలసీమ ఎస్సీ, ఎస్టీ మానవహక్కుల వేదిక నాయకులు జేవీ రమణ, రిటైర్డ్ అధికారులు, పౌరహక్కుల సంఘం నేతలు, జేవీవీ నాయకులు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, పలు ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వైద్యో నారాయణో హరి



● కనిపించే దైవమా నీకు వందనం
● నేడు జాతీయ వైద్యుల దినోత్సవం

కడప సెవెన్‌రోడ్స్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): "వైద్యో నారాయణో హరి" అంటే వైద్యుడు నారాయణుడితో సమానమని సుమతి శతకంలో రచయిత బద్దెన ఎంతో చక్కగా వివరించారు. వైద్యులు చేసే సేవలు, రోగులను కాపాడటం వంటి విషయాలను అందులో పేర్కొన్నారు. సృష్టి జీవం పోస్తే.. పునఃసృష్టి చేసేది మాత్రం వైద్యుడే. అటువంటి వారి గురించి ఎంత చెప్పినా తక్కువే. అంతెందుకు.. ప్రపంచాన్ని అల్లకల్లోలం చేసిన కరోనా సమయంలోనూ డాక్టర్లు కుటుంబాలను సైతం పక్కనపెట్టి సేవలందించారు. ఒక్కమాటలో చెప్పాలంటే.. భగవంతుడి తర్వాత చేతులెత్తి దండం పెట్టించుకునే ఒకే ఒక్కరు వైద్యుడు. నేడు జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

పశ్చిమ బెంగాల్ మొదటి ముఖ్యమంత్రి డాక్టర్ బిధన్ చంద్రరాయ్ జ్ఞాపకార్థం ప్రతి ఏడాది జూలై 1న జాతీయ వైద్యుల దినోత్సవాన్ని జరుపుతారు. ఈయన 1882 సంవత్సరం జూలై 1లో జన్మించినందున ఆయన సేవలకు గుర్తుగా స్మరించుకుంటారు. సమాజంలో వైద్యుల సేవలు ఎంతో విలువైనవి. వీరు రోగులకు మానసిక, శారీరక సాంత్వన చేకూరుస్తారు. నిరంతరం రోగులకు అందుబాటులో ఉంటూ, కుటుంబానికి సైతం ఖచ్చితమైన సమయాన్ని ఇవ్వలేక రోగి బాగోగుల గురించి పగలనక, రాత్రనక సేవలంది స్తుంటారు. కరోనా లాంటి వైరస్ విజృంభన సమయంలోనూ ప్రాణాలను సైతం లెక్కచేయక ఎందరో ప్రాణాలను కాపాడారు. అటువంటి వారిని గౌరవించాలి. కానీ నేటి పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని పలువురు వైద్యులు ఆవేదన చెందుతున్నారు. వైద్యుడు అంటే డబ్బులు గుంజే ఓ బిజినెస్ మెన్‌లా చూస్తున్నారని, తగిన గౌరవం ఇవ్వకపోగా తమపైనే దాడులు చేస్తున్నారని చెబుతున్నారు. రోగికి బాగలేనప్పుడు గోల్డెన్ అవర్‌లో వైద్యుల వద్దకు తీసుకెళ్తే కచ్చితంగా ఆ ప్రాణాన్ని కాపాడతారని, అలా చేయక సమయం దాటిన తర్వాత ఆసుపత్రులకు తీసుకొచ్చి మళ్లీ డాక్టర్లపైనే నిందెలు మోపడం బాధిస్తుందని అంటున్నారు. ఏదేమైనా ప్రాణాలను కాపాడే వైద్యులను గౌరవించడం మన బాధ్యత.

వైద్యుల పట్ల గౌరవం ఉండాలి

- డాక్టర్ వెంకటేశ్వర్లు, సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్, కడప



గత 33 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో రోగులకు సేవలను అందిస్తున్నాను. గతంతో పోలిస్తే వైద్యుల పట్ల రోగుల వైఖరి మారింది. ఖచ్చితత్వ నాణ్యమైన వైద్యం అందించేందుకు కొన్ని రోగ నిర్ధారణ పరీక్షలు చేయాల్సి ఉంటుంది. ఆ పరిస్థితుల్లో వైద్యం ఖరీదైందని రోగుల భావిస్తుం టారు. నేడు అన్నిటిపై ధరలు పెరిగాయి. దానికి మేమేదో దోచుకుంటున్నామని నెపం వేయడం కరెక్టు కాదు. కరోనా వంటి విపత్కర సమయంలోనూ ప్రాణాలను, కుటుంబాలను పక్కన పెట్టి చికిత్స అందించాం. ఆయుష్షు ఉన్నంత వరకు రోగులకు సేవ చేయాలని ఆశిస్తున్నాను. వైద్యుల పట్ల మునుపటి గౌరవం ఉంటే బాగుంటుంది.

వెనుకంజలో కడప... అనంతపురం జట్లు


74 పరుగులు చేసిన తోషిత్‌యాదవ్ (నెల్లూరు)

కడపస్పోర్ట్స్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-19 మెన్స్ మల్టీడే (మూడురోజుల) క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా వివిధ జట్ల మధ్య సోమవారం సాగు తున్న మ్యాచ్‌లలో తమ ప్రత్యర్థి జట్లపై కడప, అనంతపురం జట్లు వెనుకంజలో వున్నాయి. వివరాలిలా...

కేఓఆర్‌ఎం మైదానంలో...

నగర శివారు ప్రాంత కేఓఆర్‌ఎం క్రికెట్ మైదానంలో నెల్లూరు- కడప జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లో టాస్ నెగ్గిన కడప జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 69.3 ఓవర్లలో 232 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో తోషిత్‌యాదవ్ 74 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 18 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 129 పరుగులు చేసింది. ఇందులో గురువిఘ్నేష్ 53 పరుగులు చేయగా రణధీర్‌రెడ్డి 47 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. దీంతో కడప జట్టు మరో 103 పరుగుల లోటుతో వెనుకంజలో వుంది. ఆటకు మంగళవారం రెండవరోజు.

ఏసీఏ మైదానంలో

నగర రిమ్స్ సమీపంలోని వైఎస్ రాజారెడ్డి క్రికెట్ మైదానంలో అనంతపురం-చిత్తూరు జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో టాస్‌నెగ్గిన చిత్తూరు జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగి 44 ఓవర్లలో 189 పరుగులకు కుప్పకూలింది. ఇందులో సాయిచరణ్ 55 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు తన మొదటి ఇన్నిం గ్స్‌లో ఆట ముగిసే సమయానికి 39 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 179 పరుగులు చేసింది. ఇందులో రెహన్ 108 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. దీంతో మరో 10 పరుగుల వెనుకంజలో నిలిచింది. ఆటకు మంగళవారం రెండవరోజు.

ఏడాదిలో ముగ్గురు కమిషనర్లు మారారు

● మున్సిపాలిటీ అభివృద్ధి ఎలా సాగుతుంది
● ప్రశ్నించిన ప్రొద్దుటూరు మున్సిపల్ వైస్ చైర్మన్

ప్రొద్దుటూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): "కూటమి ప్రభుత్వం వచ్చాక ఏడాదిలో ముగ్గురు కమిషనర్లు మారారు, 15 నెలలుగా కాంట్రాక్టర్లకు రూ.23 కోట్ల బిల్లులు చెల్లించలేదు. ఇంక మున్సిపాలిటీ లో అభివృద్ధి ముందుకు ఎలా సాగుతాయి? కనీసం 6 నెలలుగా వార్డుల్లో దోమల మందు కూడా పిచికారి చేయని దుస్థితి నెలకొంది" అంటూ మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారు రెడ్డి, కౌన్సిలర్ ఇర్ఫాన్ బాషా ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం స్థానిక మున్సిపల్ సభాభవనంలో చైర్ పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి అధ్యక్షతన జరిగింది. ఈసభలో కౌన్సిల్ సభ్యులు మాట్లాడుతూ ప్రజల నుంచి కోట్ల రూపాయల పన్నులు రాబడుతున్న మీరు ప్రజలకు పన్నులో మినహాయింపు ఇస్తారా అని నిలదీశారు. కోట్ల నిధులున్నా మున్సిపాలిటీలో మురుగునీటి వ్యవస్థ అధ్వాన్నంగా ఉందన్నారు. వైస్ చైర్మన్ బంగారు రెడ్డి, కౌన్సిలర్ వంశీధర్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక ఒక్క రూపాయ అభివృద్ధి పని అయినా మొదలు పెట్టారా అని ప్రశ్నించారు. కౌన్సిలర్ జిలాన్ మాట్లాడుతూ మున్సిపాలిటీ అద్దెగదులకు బాడుగలు వసూళ్లలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఆక్రమణలను ప్రోత్సహించేలా మీ చర్యలున్నాయని బంగారురెడ్డి ఆగ్రహించారు. ఈ అంశంపై చాలా సేపు చర్చ సాగింది. మున్సిపల్ కమిషనర్ చింతా రవిచంద్రారెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీకి వచ్చి పదిహేను రోజులైందన్నారు. త్వరలో కాంట్రాక్టర్ల బిల్లులతో సహా అభివృద్ధి పనులు వేగవంతం అవడానికి కృషి చేస్తానన్నారు. అనంతరం 12 అంశాల అజెండాపై చైర్‌పర్సన్ ఆమోదం తెలిపారు.

బడికోసం పిల్లల పోరాటం


గ్రామస్థులు, తల్లిదండ్రులతో కలిసి ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు

కడప సెవెన్‌రోడ్స్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): స్కూల్ విలీనం వద్దు మా ఊర్లోనే మా బడి కొనసాగించాలి అంటూ చిన్నారులు సోమవారం కలెక్టరేట్‌లో వినతి అందించారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద చిన్నారులు గ్రామస్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. అట్లూరు మండలం ఎస్.వెంకటాపురం (రంగంపల్లె) గ్రామానికి చెందిన ఊర్లో ఒకటి నుంచి ఐదవ తరగతి వరకు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉందన్నారు. స్కూల్స్ విలీనంలో భాగంగా చెన్నేపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 3వ తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థులను కుంభగిరి పంచాయతీ ఎస్.వెంకటాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విలీనం చేశారన్నారు. అయితే విలీనం తమకు వద్దు అంటూ విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరారు.

అజిత్‌రెడ్డికి గోల్డ్ మెడల్



కమలాపురం రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చదిపిరాళ్ల గ్రామానికి చెందిన చాగారి చంద్ర ఓబుళ్‌రెడ్డి కుమారుడు చాగారి అజిత్‌రెడ్డి ఫెన్సింగ్ క్రీడలో ప్రతిభ కనబరిచి విజయం సాధించారు. జూన్ 29వ తేదీన విజయవాడలో నిర్వహించిన అండర్-12 ఫెన్సింగ్ క్రీడలో స్టేట్ చాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబరచి గోల్డ్‌మెడల్ పొందాడు. దీంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

మంత్రి లోకేశ్‌కు ఫిర్యాదు

కలసపాడు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కలసపాడులోని పార్టీ కార్యాలయంలో ఈ నెల 26న జరిగిన గొడవలో పోలీసులు తనను వేధించడంపై మంత్రి నారాలోకేశ్‌కు ఫిర్యాదు చేసినట్లు టీడీపీ నాయకుడు ప్రహ్లాద్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు విజయవాడలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మంత్రి లోకేశ్‌ను కలిసి వివరించినట్లు తెలిపారు. స్పందించిన మంత్రి జరిగిన సంఘటనపై విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

దంపతులపై దాడి... కేసు నమోదు

పులివెందుల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భాకరాపురం ప్రాంతంలో నివాసముంటున్న దంపతులపై పక్కింటి వారు దాడి చేసిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ నారాయణ వివరాల మేరకు.. దేవిరెడ్డి సరస్వతి, శివ శంకర్‌రెడ్డి దంపతులు కాగా వీరి ఇంటి పక్కనే పవన్ కుమార్ రెడ్డి నివాసముంటున్నాడు. అతని ఇంటి ఆవరణంలో కొబ్బరి చెట్టు ఉండడంతో వాటి వేర్లు ప్రహరీగోడ కిందకు వచ్చి గోడ కూలిపోయే పరిస్థితికి చేరింది. వాటి చెట్టు కొమ్మలు కూడా ఇంట్లో పడుతున్నాయని పవన్‌కుమార్‌రెడ్డికి పలుమార్లు తెలియజేశారు. దీన్ని సహించలేని పవన్‌కుమార్‌రెడ్డి తన కొడుకు సందీప్‌కుమార్‌రెడ్డితో కలిసి దంపతులను నేరుగా ఇంట్లోకి వెళ్లి కట్టెలతో దాడి చేశారన్నారు. ఈ దాడిలో సరస్వతికి స్వల్ప గాయాలు కాగా శివశంకర్‌రెడ్డికి పలుచోట్ల తీవ్ర గాయాలై కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స పొందుతున్నట్లు ఎస్ఐ తెలిపారు. దీనిపై సరస్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోండి

● ప్రభుత్వానికి ఓ వృద్ధుడి వేడుకోలు


పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న వెంకటసుబ్బారెడ్డి

కడప మారుతీనగర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె మండలం బుగ్గిలేటిపల్లెలో గత 2009లో తాము కొనుగోలు చేసిన 77 సెంట్ల భూమిని సదరు మండలం లింగారెడ్డిపల్లెకు చెందిన ఇద్దరు వ్యక్తులు కబ్జా చేసేందుకు కుట్రపన్ని మమ్మల్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని గజ్జల వెంకటసుబ్బారెడ్డి అనే వృద్ధుడు ఆరోపించారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనకు ముగ్గురు కుమార్తెలని, కుమారులు లేకపోవడంతో వృద్ధాప్యంలో ఆసరాగా వుంటుందనే ఆశతో తమ బంధువుల దగ్గర నుంచి ఆ భూమిని కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. ఇదిలా వుండగా ఆ భూమిని కొందరు ఆక్రమించేందుకు కుట్రపన్ని బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. ఈ విషయంపై సీకే దిన్నెపోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వారు భూ రికార్డులు పరిశీలించి తమకే న్యాయం చేశారన్నారు. అయినప్పటికీ ఆక్రమణదారులు వినకుండా పెద్ద మనుషులతో పంచాయితీ చేయించి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, జిల్లా అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. ఈయన వెంట బాధితుడి భార్య గజ్జల జయలక్ష్మమ్మ పాల్గొన్నారు.

ఆర్థిక పరిపుష్టి అవగాహన పోస్టర్ల ఆవిష్కరణ

కడప కలెక్టరేట్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): సంతృప్తికరమైన ఆర్థిక పరిపుష్టిపై 3 నెలల పాటు నిర్వహించే క్యాంపెయిన్‌కు సంబంధించి కేంద్ర, ఆర్థిక మంత్రిత్వ శాఖ, బ్యాంకింగ్ రంగం ప్రచురించిన పోస్టర్లను జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ సోమవారం ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో జేసీ మాట్లాడుతూ సమాజంలో ప్రతి కుటుంబానికి ఆర్థిక పరిపుష్టి చేకూరేలా జిల్లాలో ఆర్థిక అక్షరాశ్యతను పెంపొందించడంతో పాటు బ్యాంకింగ్ యాక్సెస్‌ను విస్తరిస్తున్నామన్నారు. డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహిస్తున్నామన్నారు. ప్రజలను ఆర్థికంగా చైతన్యవంతం చేయడం, సామాజికంగా శక్తివంతం చేయడంలో జిల్లా యంత్రాంగం, బ్యాంకర్లు ఆయా శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

మహిళ మెడలో చైను అపహరణ

వీరపునాయునిపల్లె, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గంగిరెడ్డి పల్లె గ్రామానికి చెందిన భారతి అనే మహిళ మెడలో ఉన్న బంగారు చైనును ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఎస్ఐ మంజునాథ్ వివరాల మేరకు.. మహిళ పొలం వద్ద పనులు చేసుకుంటుండగా ద్విచక్ర వాహనంలో వచ్చిన వారు ఆమెను భయభ్రాంతులకు గురిచేసి చైనును అపహరించినట్లు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితులను పట్టుకునేందుకు రెండు బృందాలను ఏర్పాటు చేశామని, ఒంటరిగా ఉన్న మహిళలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

62 రోజుల పాటు చేపల వేట నిషేధం

కొండాపురం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టులో జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు 62 రోజుల పాటు చేపల వేటకు నిషేధం ఉంటుందని మత్స్యశాఖ సహాయకుడు బాలరాజు, అసిస్టెంట్ మల్లీశ్వరిలు తెలిపారు. ఈ సమయం చేపల సంతానోత్పత్తి కాలం అయినందున, చేపల సంరక్షణ కొరకు విరామం పాటించాలని మత్స్యకారులను కోరారు. నిబంధనలు అతిక్రమించి చేపల వేటకు వెళితే కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

రాజంపేట లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఏర్పాటు

రాజంపేట టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట నూతన లయన్స్‌క్లబ్ కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా న్యాయవాది తరిగోపుల లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా సీనియర్ న్యాయవాది సింగంశెట్టి కృష్ణకుమార్, కోశాధికారిగా భువనగిరిపల్లెకు చెందిన కంబయ్యగారి నరసింహులును ఏకవగ్రీంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తాను ఇప్పటికి 5 సార్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా కొనసాగి అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించామన్నారు. తిరిగి తనను అధ్యక్షుడిగా ఎన్నుకోవడం సంతోషంగా ఉందన్నారు. సేవా కార్యక్రమాలు విరివిగా నిర్వహిస్తామన్నారు.

పేదలకు భూములు పంపిణీ చేయాలి



నిరసన తెలుపుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

రైల్వేకోడూరు,జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూములను స్వాదీనం చేసుకుని పేదలకు పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి, కార్యదర్శి ఎం.జయరామయ్య తెలిపారు. సోమవారం రైల్వేకోడూరు రెవెన్యూ కా ర్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ మానసకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మిట్టమీదపల్లె పాఠశాలకు వాటర్ ఫిల్టర్ వితరణ

రాజంపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి):రాజంపేట మండలం మిట్టమీదపల్లె ప్రాథమిక పాఠశాలకు ఆ గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ పతకమూరి వెంకటసుబ్బయ్య వాటర్‌ఫిల్టర్‌ను ఉచితంగా అందజేశారు. ప్రధానోపాధ్యాయులు షేక్ జమాల్‌బాషా ద్వారా వాటర్‌ఫిల్టర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాటర్‌ఫిల్టర్ వల్ల విద్యార్థులకు తాగునీటి సమస్య ఉండదన్నారు.

సుకుమార్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన ముక్కా



సుకుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ముక్కా

రైల్వేకోడూరు రూరల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన అనంతరాజుపేట మాజీ సర్పంచ్ సుకుమార్ రెడ్డి కుటుంబాన్ని సోమవారం కోడూరు టీడీపీ ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి పరామర్శించారు. వారి కుటుంబానాకి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి

ఒంటిమిట్ట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఏడాది కాలంలో టీడీపీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని రాజంపేట టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కొత్త మాధవరంలో టీడీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీలో వర్గ విభేదాలు లేకుండా అందరం కలిసికట్టుగా పనిచేద్దామన్నారు. జూలై 2వ తేదీ నుంచి ప్రతి ఇంటికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి పథకాలను తెలియజేయాలన్నారు. మండలంలోని పార్టీ నాయకులందరూ ఏకమై ప్రతి గ్రామం లో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను, అభివృద్ధిని వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు క్లాస్-1 కాంట్రాక్టర్ ఎస్వీ రమణ, శివారెడ్డి, హరినాథరెడ్డి, శ్రీహరి, బోగా శంకరయ్య, శ్రీనివాసరాజు, మధుసూదన్, సుబ్రమణ్యం, బడిచెర్ల శ్రీనివాసులు, హుస్సేన్‌పీరా, వెంకటేశ్వర్లు, కాలె రమణ, అనిల్‌రెడ్డి, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి చర్యలు తీసుకోండి



మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ బలోపేతానికి చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ పేర్కొనట్లు రాజంపేట పార్లమెంట్ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. ఆదివారం గుంటూరు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో లోకేశ్‌ను కలినట్లు తెలిపారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ రాజంపేటలో ఈనెల 2 నుంచి జరిగే సుపరిపాలన మొదటి అడుగు కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలన్నారు. అలాగే రాజంపేట నియోజకవర్గంలో టీడీపీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలన్నారు.

పదవీ విరమణ ఉద్యోగులకు ఘనంగా వీడ్కోలు



పదవీ విరమణ పొందిన ఉద్యోగులను సన్మానిస్తున్న కలెక్టర్





కోడూరులో లోకేశ్వర్‌రాజు, సంబేపల్లెలో రెడ్డెయ్యరెడ్డి దంపతులకు సన్మానం

రాయచోటి(కలెక్టరేట్), జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖలో సుదీర్ఘకాలం పాటు విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన మదనపల్లి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాఘవేంద్ర, ల్యాండ్ సెక్షన్ సూరింటెండెంట్ దైవాదీనంలను కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఘనంగా సన్మానించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం పదవీ విరమణ పొందిన వారిద్దరినీ కలెక్టర్ శాలువాలు కప్పి పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ నరసింహకుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఒంటిమిట్టలో...

ఒంటిమిట్ట: ఉపాధ్యాయ వృత్తికే లోకేశ్వర్ రాజు వన్నె తెచ్చారని ఎంఈవో వెంకటసుబ్బయ్య తెలిపారు. లోకేశ్వర్‌రాజు సాలాబాదులోని ఎంపీపీఎస్ పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ సోమవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు ప్రభాకర్, రఘునాథరాజు, సుజాత, నరేష్‌కుమార్, మూర్తి, అమర్‌నాథ్, మస్తాన్ బాబు, రాజేంద్ర పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికీ పదవీ విమరణ సహజం

సంబేపల్లె, జూన్30(ఆంధ్రజ్యోతి): ప్రతి ఉద్యోగికీ పదవీ విమరణ సహజమేనని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు అన్నారు. సంబేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పదవీ విమరణ పొందిన రెడ్డెయ్యరెడ్డికి నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాల హెచ్‌ఎం సుంకర రామకృష్ణ, డైటీ సీనియర్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి, మండల విద్యాశాఖాధికారి శ్రీనివాసులు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్, విద్యా కమిటీ చైర్మన్ రెడ్డిరాణి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ

సిద్దవటం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : సిద్దవటం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు, ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎస్‌ఐ అమీర్‌ఖాన్, మాధవరం-1 పంచాయతీలోని జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీవీ సుధాకర్ పదవీ విరమణ పొందగా వారిని ఉద్యోగులు సన్మానించారు.

మీడియాపై దాడి పిరికిపంద చర్య : ఏపీయూడబ్ల్యూజే

రాయచోటి(కలెక్టరేట్), జూన్30(ఆంధ్రజ్యోతి): మీడియాపై దాడి పిరికిపంద చర్య అని, దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు గౌనిపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

మీడియాపై దాడి అమానుషం

రైల్వేకోడూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మీడియాపై దాడి అమానుషమని రైల్వేకోడూరు జర్నలిస్టులు పేర్కొన్నారు. సోమవారం వారు గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నిరసన చేపట్టారు.

విద్యాసామగ్రి వితరణ

రామాపురం, జూన్30(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో రామాపురం మండలం హసనాపురం పంచాయతీ వడ్డిపల్లె ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలో సోమవారం అధ్యక్షుడు లయన్ శివారెడ్డి ఆర్థిక సహాయంతో 25 మంది విద్యార్థులకు నోట్ బుక్స్, పలకలు, పెన్నులు, పెన్సిళ్లు, రబ్బర్లు పంపిణీ చేసినట్లు కార్యదర్శి లయన్ షేక్ ఇందాద్ అహమ్మద్ తెలిపారు. అనంతరం దాత, శివారెడ్డి మాట్లాడుతూ తాను చదువుకున్న పాఠశాలకు సేవ చేయాలనే ఉద్దేశ్యంతోనే ఈ కార్యక్రమం చేపట్టామన్నారు.

ఉపాధి హామీ పథకంలో అవినీతిపై దృష్టి సారించాలి

రాయచోటి(కలెక్టరేట్),జూన్30 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న అవినీతిపై దృష్టి సారించాలని వైసీపీ నేతలు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఉపాధి హామీ పనులను గ్రామ పంచాయతీల ద్వారానే నిర్వహించి కూలీలకు సకాలంలో బిల్లులు చెల్లించాలన్నారు. రాయచోటి నియోజకవర్గ పంచాయతీ వింగ్ అధ్యక్షుడు మానస వెంకట్రమణ, రాష్ట్ర పంచాయతీ విభాగ సెక్రటరీ గాలివీటి ప్రవీణ్‌రెడ్డి, సూరం వెంకటసుబ్బారెడ్డి, జానం రవీంద్ర, కోడూరు శివశంకర్‌రెడ్డి, రాజంపేట లక్ష్మీనారాయణ రెడ్డి, కౌన్సిలర్ సుగవాసి ఈశ్వర్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

రాజంపేట టౌన్,జూన్ 30(ఆంధ్రజ్యోతి):ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 4, 5 తేదీల్లో ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టనున్నట్లు యూనియన్ కార్యదర్శి బీసీ శేఖర్ తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలన్నారు. సీసీఎస్ కార్యాలయ ఉద్యోగులకు అందుబాటులో ఉండేవిధంగా పీఎస్‌బీఎస్‌ను ఏర్పాటు చేయాలన్నారు.

నిరుపేదలకు భూ పంపిణీ చేయాలి



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఓబులవారిపల్లె, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు భూ పంపిణీ చేయాలని కార్మిక సంఘం నాయకులు, గ్రామస్థులు తెలిపారు. సోమవారం వారు తహసీల్దార్ యామినికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల పరిధిలోని కొర్లకుంట పంచాయతీలో సర్వేనంబరు 249/1లో ఉన్న 172 ఎకరాల భూమిని కొర్లకుంట దళితులకు కేటాయించాలన్నారు. భూ పంపిణీ చేయకుంటే పోరాటాలకు సిద్ధమవుతామని డిమాండ్ చేశారు. సీపీఐ ఓబులవారిపల్లె మండల కార్యదర్శి చింతలపూరి నాగమ్మ, డీహెచ్‌పీఎస్ నియోజకవర్గ కార్యదర్శి మోడి శివయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి

రాయచోటిటౌన్, జూన్30(ఆంధ్రజ్యోతి): ఆశావర్కర్ల సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన ఆశావర్కర్లతో కలిసి జిల్లా వైద్యాధికారి లక్ష్మీనరసయ్యకు సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 9న జరిగే సమ్మెలను విజయవతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశాలు సుజాత, భారతి తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ల వితరణ

పుల్లంపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఎగువరెడ్డిపల్లె గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు కుప్పాల రామకృష్ణయ్య సోమవారం పంచాయతీలోని పాఠశాలలకు కంప్యూటర్లు వితరణ చేశారు. ఈ సందర్భంగా టి.కమ్మపల్లె, ఎగువరెడ్డిపల్లె, శ్రీ వెంకటేశ్వరనగర్ ఎస్టీ కాలని, క్రిష్ణంపల్లె, ఎగువరెడ్డిపల్లెలోని పాఠశాలలకు ఆయన ఐదు కంప్యూటర్లను వితరణ చేశారు. ఎంఈవోలు చక్రధర్ రాజు, నాగతిరుమలరావులు మాట్లాడుతూ విశ్రాంత ఉపాధ్యాయులు రామకృష్ణయ్య తన సొంత పంచాయతీలోని పాఠశాలలకు కంప్యూటర్లను వితరణ చేయడం ఆనందంగా ఉందన్నారు.

ఈసెట్ కౌన్సెలింగ్‌పై జగన్‌రెడ్డి మాటలు హాస్యాస్పదం

- టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్

రాజంపేట టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఈసెట్ కౌన్సెలింగ్‌పై మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్ అన్నారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఈసెట్ కౌన్సెలింగ్ ఎప్పుడు నిర్వహించారో వైఎస్ జగన్‌కు తెలియదా అని ఎద్దేవా చేశారు. వైసీపీ హయాంలో ఈసెట్ కౌన్సెలింగ్ 2022 సెప్టెంబరులో జరిగిందని, 2023లో జూలై ఆఖరుకు కౌన్సెలింగ్ పూర్తి చేశారన్నారు. ఈసెట్ కౌన్సెలింగ్ నిర్వహణపై విమర్శించడం జగన్ అజ్ఞానానికి నిదర్శనమన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యా వ్యవస్థను గాడిలో పెట్టారన్నారు. అదే జగన్ పాలనలో విద్యను వింత విద్యగా మార్చేసి నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం మూడో స్థానంలో ఉన్న రాష్ట్రాన్ని 19వ స్థానానికి దిగజార్చారని విమర్శించారు. నాయకులు పాండురాజు, శివప్రసాద్, సాయిరాజు, హరి పాల్గొన్నారు.

ఎన్నికల వాగ్దానాలను అమలు చేయాలి: ఏఐవైఎఫ్

రైల్వేకోడూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాను అమలు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు దార్ల రాజశేఖర్ తెలిపారు. సోమవారం 2024 ఎన్నికల్లో 20 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని కూటమి ప్రభుత్వం వాగ్దానం చేసిందన్నారు. తీరా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇంత వరకు ఉద్యోగాలు కాదుకదా నిరుద్యోగ భృతి కూడా అందలేదన్నారు. ఏ ప్రభుత్వం వచ్చినా నిరుద్యోగులను పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో విజయ్, మత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమ్మెపై నోటీసు అందజేత



తహసీల్దారు పీర్‌మున్నీకి సమ్మె నోటీసు అందజేస్తున్న సీఐటీయూ నేతలు, కార్మికులు

రాజంపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలపై ఈనెల 9న నిర్వహించనున్న రాష్ట్రవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ పిలుపునిచ్చారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు రాజంపేట మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, తహసీల్దారు పీరుమున్నీలకు ముందస్తు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని, ప్రైవేటీకరణను రద్దు చేయాలని, లేబర్‌కోడ్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రమణ, లక్ష్మీదేవి, ప్రసాద్, తహసీల్దారు ఆఫీసు వద్ద వీఆర్‌ఏ సంఘం నాయకులు శంకర్, సుబ్రమణ్యం, రమణయ్య, బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్లీనరీని జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఆర్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఓబులేసు

రాయచోటిటౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలపై ఈ నెల 23, 24వ తేదీల్లో కడపలో జరగనున్న రెవల్యూషనరీ స్టూడెంట్ ఫోరం (ఆర్‌ఎస్‌ఎఫ్) రాష్ట్ర స్థాయి ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేసు యాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం రాయచోటి ప ట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులతో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రైవేటు, కార్పొరేట్ పాఠలశాలల ఫీజుల దోపిడీపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలకు, జూనియర్ కాలేజీలు, పాలిటెక్నిక్, డిగ్రీ కాలేజీలకు నిధులు కేటాయించాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, సాంఘిక సంక్షేమ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎఫ్ నాయకులు అష్రఫ్, బాదుల్లా, కల్యాన్, ఫైజాన్, కార్తీక్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

ఒంటిమిట్ట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) :ఒంటిమిట్ట బస్టాండుకు ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్ ఆక్రమణలను పంచాయతీ అధికారులు తొలగించారు. ఈనెల 14న ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'ఫుట్‌పాత్‌లనూ వదలని వ్యాపారులు' అనే శీర్షకన కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన పంచాయతీ కార్యదర్శి సుధాకర్ ముందుగా నోటీసులు జారీ చేశారు. కొద్దిరోజులు గడిచిన తర్వాత సోమవారం ఆక్రమణలు తొలగించారు. ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తీసుకెళ్లి పంచాయతీ కార్యాలయంలో ఉంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుకిరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌లను వ్యాపారులు ఆక్రమించడం వల్ల పాదచారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించడంతో పాదచారులు రోడ్డుపైన వెళుతున్నారని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అధికారులు మల్లేష్, సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

గాలివీడు, జూన్30(ఆంధ్రజ్యోతి): గ్రీవెన్స్‌లో వచ్చే దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ భాగ్యలత వీఆర్‌వోలకు సూచించారు. సోమవారం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా భూములకు సంబంధించిన ముటేషన్, చుక్కల భూములు, అడంగళ్లు, వన్‌బీ వంటి సమస్యలు ఎక్కువగా వచ్చాయన్నారు. గ్రామాల్లోని వీఆర్‌వోలు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిశీలించాలన్నారు. ప్రస్తుతం నడుస్తున్న రీసర్వే విధానాన్ని పక్కాగా నిర్వహించాలని సర్వే అధికారులకు సూచించారు.

రాజంపేటలో టీడీపీ నేతల అంతర్గత సమావేశం



మాట్లాడుతున్న పార్టీ పరిశీలకుడు చిట్టిబాబు

రాజంపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : రాజంపేటలో టీడీపీ నేతలు సోమవారం అంతర్గతంగా సమావేశమయ్యారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు చిట్టిబాబుతో పాటు పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి, జిల్లా మాజీ మహిళా అధ్యక్షురాలు పత్తిపాటి కుసుమకుమారి, నియోజకవర్గ టీడీపీ నాయకుడు పోలి సుబ్బారెడ్డి, సుండుపల్లె నాయకుడు మహేష్‌నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో టీడీపీ సభ్యత్వ కార్యక్రమాలపై ప్రధానంగా చర్చ జరిగినట్లు సమాచారం. అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థికి 80 వేలు పైబడి ఓట్లు రాగా సభ్యత్వాలు ఏకంగా లక్షా 40 వేలు రావడంపై తీవ్రంగా చర్చ జరిగినట్లు తెలిసింది. పార్టీ అభ్యర్థికి వచ్చిన ఓట్ల కంటే అత్యధికంగా సభ్యత్వాలు జరగడంపై చర్చ జరిగినట్లు సమాచారం. ఈ సభ్యత్వాల తప్పిదంలో జరిగిన లోపాలపై అంతర్గతంగా చాలా సీరియస్‌గా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఆయా మండలాల్లో గ్రామస్థాయి నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, బూత్ లెవల్ కమిటీ సభ్యులతో టీడీపీ నేతలు అంతర్గతంగా చర్చించుకుని ఈ సభ్యత్వ నమోదులో సంబంధిత వ్యక్తిని పిలిపించి అతని సమ్మతంతోనే సభ్యత్వం నిర్వహించారా లేక తెలియకుండా సభ్యత్వం చేశారా తదితర అంశాలపై ఓటర్లతో చర్చించి వారి అభిప్రాయం మేరకే సభ్యత్వ కార్డులు ఇవ్వాలని లేదంటే ఇవ్వవద్దని నిర్ణయించినట్లు తెలిసింది. అత్యధికంగా నమోదైన సభ్యత్వ నమోదు కార్యక్రమాల పైనే చర్చ జరిగినట్లు సమాచారం.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

రాజంపేట - A.C.O.: 99854 11312 | రాయచోటి - A.C.O.: 63006 38887 | రాయచోటి - S.R.: 99858 65573 | రైల్వేకోడూరు - S.R.: 98854 12462 | D.C.M.: 99854 11184

ప్రభుత్వం మారినా.. తగ్గేదేలే..!

● రోడ్డుకు అడ్డంగా రాళ్లు ● సీసీపల్లెలో వైసీపీ దౌర్జన్యం


దారికి అడ్డంగా వేసిన రాళ్లు

పెద్దతిప్పసముద్రం జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా.. గ్రామాల్లో వైసీపీ నాయకుల దౌర్జన్యాలు మాత్రం ఆగడం లేదనడానికి పులికల్లు పంచాయతీ చిన్న వెంకట్రామన్నగారిపల్లెలో సోమవారం జరిగిన ఉదంతం నిదర్శనంగా నిలుస్తోంది. సీసీ పల్లెకు చెందిన ముస్తాని రామమూర్తి తెలుగుదేశం పార్టీ సానుభూతిపరుడు. ఇదే గ్రామానికి చెందిన ముస్తాని చిన్నప్ప, ముస్తాని జయరాము కుటుంబాలతో ఇతనికి భూ వివాదం ఉంది. ఈ నేపథ్యంలో వారు వైసీపీ హయాంలో రామమూర్తిని ఇబ్బందులకు గురి చేశారు. అయినా, అతను స్పందించకపోవడంతో ఆదివారం అతని ఇం టికి వెళ్లే దారికి అడ్డుగా ట్రాక్టర్లతో బండరాళ్లు వేసి మూసేశారు. ఇదేమని ప్రశ్నిస్తే బెదిరిస్తున్నట్లు రామ్మూర్తి సోమవారం పెద్దతిప్పసముద్రం పోలీసులకు పిర్యాదు చేశాడు. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నా.. వైసీపీ నేతలకు భయపడి బతకాల్సిన పరిస్థితి గ్రామాల్లో ఉందని టీడీపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య

గుర్రంకొండ, జూన్ 3(ఆంధ్రజ్యోతి):ఆర్థిక సమస్యలు తాళలేక ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సంబేపల్లె మండలం నారాయణరెడ్డిగారిపల్లె పంచాయతీ కొండావాండ్లపల్లెకు చెందిన శ్రీనివాసులరెడ్డి (52)కి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. వ్యవసాయం కోసం అప్పులు చేశాడు. ఈ మధ్యకాలంలో కుమార్తెలిద్దరికి వివాహం చేయడంతో అప్పుల భారం మరింతగా పెరిగింది. దీంతో తీవ్ర ఒత్తిడికి లోనై ఈ నెల 27న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. చెర్లోపల్లె పంచాయతీ సూరప్పగారిపల్లె హంద్రీ-నీవా కాలువ సమీపంలో ఓ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు సోమవారం సమాచారం అందించడంతో అక్కడికి చేరుకొన్న పోలీసులు మృతుడు శ్రీనివాసులరెడ్డిగా గుర్తించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

రైల్వేకోడూరు రూరల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): కడప చెన్నై ప్రధాన రహదారిలోని ఎస్.ఉప్పరపల్లి వద్ద సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కడప జిల్లా ఎర్రగుంట్లకు చెందిన బత్తల గోపాల్ (21) చెన్నై మున్సిపాలిటీలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. అనారోగ్యంతో ఉన్న తన పెద్దనాన్నను పరామర్శించేందుకు చెన్నై నుంచి ఎర్రగుంట్లకు మోటారుబైకుపై వస్తుండగా ఉప్పరపల్లి వద్ద హైదరాబాద్ నుంచి పాండిచ్చేరి వెళుతున్న ప్రైవేట్ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

యూఎస్‌ఏలో మృతి.. గోపిదిన్నెలో అంత్యక్రియలు

తంబళ్లపల్లె, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న యూఎస్‌ఏలోని వాటర్‌ఫాల్స్ వద్ద జరిగిన ప్రమాదంలో మృతి చెందిన వెంకట జవహర్‌రెడ్డి(30)కి సోమవారం ఆయన స్వగ్రామం గోపిదిన్నెలో అంత్యక్రియలు నిర్వహించారు. మండలం గోపిదిన్నెకు చెందిన సప్తగిరి గ్రామీణ బ్యాంకు రిటైర్డు మేనేజరు రమేష్‌రెడ్డి కుమారుడు వెంకట్ జవహర్‌రెడ్డి అక్క లాస్యతో కలసి యూఎస్‌ఏలో ఉద్యోగం చేస్తున్నాడు ఈ నెల 21 న యూఎస్‌ఏలోని వాటర్‌ఫాల్స్ వద్ద జరిగిన ప్రమాదంలో మృతి చెందాడు. సోమవారం మృతదేహం స్వగ్రామం చేరుకోగా అశ్రు నయనాల నడుమ అంత్యక్రియలు నిర్వహించారు.

డ్రోన్లతో వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు

● 80 శాతం రాయితీపై పంపిణీ
● జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ


డ్రోన్‌ను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి

సుండుపల్లె, జూన్ 30(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో అత్యాధునిక మార్పులు తీసుకువచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివనారాయణ తెలిపారు. సోమవారం సుండుపల్లె మండలంలోని సుండుపల్లె-3 రైతు సేవా కేంద్రంలో రూ.9,80,000 లక్షలు విలువ చేసే కిసాన్ డ్రోన్‌ను 80 శాతం రాయితీతో శ్రీగణేశ్ డ్రోన్ రైతు మిత్ర సంఘం సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రానికి చెందిన డ్వాక్రా మహిళలు ఈ డ్రోన్‌ను కొనుగోలు చేశారన్నారు. ఈ డ్రోన్ సహ కారంతో క్రిమిసంహారక మందుల పిచికారీ సులభతరమవుతుందన్నారు. దీని వినియోగంతో సమయం, శ్రమ ఆదా అవుతాయన్నారు. డ్రోన్ నిర్వహణకు ప్రభుత్వం ఒకరికి శిక్షణ ఇస్తోందని తెలిపారు. అనంతరం రైతు మిత్ర సేవా సంఘం సభ్యులు, రైతులు, వ్యవసాయసిబ్బంది సమక్షంలో డ్రోన్ పనితీరును పరిశీలించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాయచోటి సహాయ సంచాలకులు శ్రీలత, కెనరా బ్యాంకు మేనేజర్ మస్తాన్, టీడీపీ పార్లమెంటు వాణిజ్య విభాగం నాయకులు దామోదర్‌నాయుడు, వ్యవసాయశాఖ అధికారి మహబూబ్‌బాషా, వ్యవసాయ శాఖ సిబ్బంది ముకుందర్, రెడ్డినాయక్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ ఆస్తుల పరిరక్షణే లక్ష్యం

● వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు పురం రామ్మూర్తి

పీలేరు రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ కమిటీ ఆస్తుల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు పురం రామ్మూర్తి తెలిపారు. సోమవారం ఆయన పీలేరు మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కేవీపల్లె మండలం గురుకుల పాఠశాల సమీపంలో రూ. 20 కోట్ల విలువైన 6.29 ఎకరాలు, తిరుపతి మార్గంలోని ఆయిల్ సీడ్స్ వద్ద రూ. 6 కోట్ల విలువైన రెండు ఎకరాలు, మండలంలోని యర్రగుంటపల్లె పంచాయతీ పరిధిలోని నెట్టిబండ వద్ద 10 ఎకరాల భూమి ఉందన్నారు. ఈ భూములు ఆక్రమణల బారిన పడకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే కేవీపల్లెలోని స్థలాన్ని పరిశీలించి సర్వేయించామన్నారు. ఆయా భూములు అన్యాక్రాంతం కాకుండా ప్రహరీగోడ నిర్మించడం లేదా చుట్టూ రాతి కూసాలు నాటించి ఇనుప కంచె వేస్తామన్నారు. పీలేరు సీఎల్‌ఆర్‌సీ కార్యాలయం పక్కన ఉన్న 46 సెంట్ల స్థలంలో రూ. 26 లక్షలతో రైతు బజారు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు పంపామన్నారు. పట్టణం మధ్యలో రైతు బజారు ఏర్పాటుతో అందరికీ సౌకర్యంగా ఉంటుందన్నారు. త్వరలోనే రైతు బజారు పనులు ప్రారంభిస్తామని తెలిపారు. జూలై 2న పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మొదటి సమావేశం నిర్వహిస్తు న్నామని, ఇందులో ఆస్తుల పరిరక్షణపై చర్చించి తదనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. మార్కెట్ యార్డు ఆవరణలో రైతులకు వసతుల కల్పనకు ప్రణాళిక రూపొందిచామన్నారు. పీలేరు ఎమ్మెల్యే సహకారంతో వనరులను సద్వినియోగం చేసుకొని మార్కెట్ కమిటీని అభివృద్ధి పథంలో నడిపిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోళ్ల కిషోర్ నాయుడు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీఎల్వోల శిక్షణకు ట్రైనర్ల ఎంపిక

● రెండు రోజుల పాటు ఢిల్లీలో శిక్షణ
● ఎంపికైన వారికి కౌన్సెలింగ్ నుంచి మినహాయింపు

కలికిరి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాలో సవరణలు, మార్పులు, చేర్పులు తదితర ప్రక్రియలు చేసే బూత్ లెవెల్ అధికారుల శిక్షణకు ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం గతంలో మంచి పనితీరు కనబరిచిన బీఎల్వోల్లో కొందరిని ఎంపిక చేసి ఈ నెల మూడవ తేదీ నుంచి రెండు రోజులపాటు ప్రత్యేక శిక్షణ ఇవ్వనుంది. ఇలా శిక్షణ పొందిన వారు నియోజకవర్గాల్లోని అన్ని మండలాలకు చెందిన బీఎల్వోలకు శిక్షణ ఇవ్వనున్నారు. ప్రతి జిల్లాకుఒక బీఎల్వో సూపర్‌వైజరును కూడా ఎంపిక చేసింది గురువారం నుంచి ఈ శిక్షణ ప్రారంభ మవుతోంది. కాగా, రెండవ బ్యాచ్‌లో కడప, అన్నమయ్య జిల్లాల్లోని 12 నియోజకవర్గాల నుంచి ఒక్కొక్కరిని ఎంపిక చేసి ఢిల్లీకి పంపుతున్నారు. వీరందరికీ మూడవ తరగతి ఏసీ సీట్లు రిజర్వు చేయడంతోపాటు, సోమవారం అందరినీ రిలీవ్ చేసి ఢిల్లీకి పంపే ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం సీఈవో వివేక్ యాదవ్ కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. శిక్షణకు వెళుతున్న వారి వివరాలు ఇలా వున్నాయి. రెండవ బ్యాచ్‌లో మొత్తం ఏడుగురు ఈఆర్వోలను ఎంపిక చేయగా అందులో కడప జిల్లా పులివెందుల నియోజకవర్గం ఈఆర్వో జి.చిన్నయ్య (కడప జీఎన్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు)ఉన్నారు. ఇక అన్నమయ్య జిల్లా పీలేరు నియోజకవర్గం కలికిరి మండలం చీకటిపల్లె వీఆర్వో బి.నరేష్‌కుమార్, మదనపల్లె నుంచి వార్డు ప్రణాళిక కార్యదర్శి డి.హరికుమార్ రెడ్డి, తంబళ్లపల్లె నుంచి వీఆర్వో మహ్మద్ నవాజ్, రాయచోటి నుంచి బీఎల్వో సూపర్‌వైజర్‌గా ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు పి.నరసింహ కుమార్, రైల్వే కోడూరు నుంచి వీఆర్వో ఎస్.ముజీబ్, రాజంపేట నుంచి వీఆర్వో శివరాజ ఎంపికయ్యారు. ఇక కడప నియోజకవర్గం నుంచి బీఎల్వో సూపర్‌వైజర్ (వార్డు కార్యదర్శి) ఏ.చిన్నవేమయ్య, బద్వేలు నుంచి వీఆర్వో ఎం.సతీష్‌చంద్రన్ రెడ్డి, పులివెందుల నుంచి వార్డు రెవెన్యూ కార్యదర్శి పి.శ్రీనివాసులు రెడ్డి, కమలాపురం నుంచి డిజిటల్ అసిస్టెంట్ కెకైలాస్‌కుమార్ రెడ్డి, జమ్మలమడుగు నుంచి వీఆర్వో ఏ.చిన్ననాగన్న, ప్రొద్దుటూరు నుంచి వార్డు రెవెన్యూ కార్యదర్శి బి.ఆంజనేయులు, మైదుకూరు నుంచి వార్డు రెవెన్యూ కార్యదర్శి బి.రామాంజనేయులును ఎంపిక చేసింది. సోమవారం వీరంతా ఢిల్లీకి వెళ్లారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

రాజంపేట టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 5న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు మూడవ అదనపు జిల్లా జడ్జి ఎస్.ప్రవీణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షిదారులు తమ సమస్యలను రాజీ చేసుకునేందుకు లోక్‌అదాలత్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్‌జడ్జి టి.కేశవ, జూనియర్ సివిల్ జడ్జి పి.రాజన్ ఉదయ్‌ప్రకాష్‌లు పాల్గొన్నారు.

ఎస్సీ మానిటరింగ్ సమావేశాలపై చిన్నచూపు

● అధికారులను ప్రశ్నించిన దళిత నేతలు


సమావేశంలో అధికారులను నిలదీస్తున్న దళిత నేతలు

నిమ్మనపల్లి జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ సమావేశాలు అంటే అధికారులకు చిన్నచూపు ఎందుకని దళిత నేతలు మునిరత్నం, యర్రయ్య అధికారులను ప్రశ్నించారు. సోమవారం తవళం పంచాయతీ దళితవాడలో పౌరహక్కుల పరిరక్షణపై నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతి నెలా సమావేశాలు నిర్వహిస్తున్నా దళితులకు చెందిన ఒక్క అర్జీని కూడా పరిష్కరించలేదన్నారు. అలాంటప్పుడు సమావేశాలు ఎందుకని అధికారులను నిలదీశారు. మాజీ సర్పంచ్ రెడ్డెప్ప మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ కింద కేవలం తొమ్మిది యూనిట్లు కేటాయింపులో తీవ్ర అన్యాయం చేశారన్నారు. విద్యుత్ అధికారులైతే ఒక్క సమావేశానికి కూడా హాజరు కాలేదని, సెలవు పేరుతో తహసీల్దార్ తపస్విని గైర్హాజరు సరైంది కాదన్నారు. సీఎస్‌డీటీ సిరాజ్ మాట్లాడుతూ ప్రతి నెలా ఒక గ్రామంలో సివిల్ రైట్స్ సమావేశం నిర్వహించి దళితవాడల్లో నెలకొన్న సమస్యలను కలెక్టర్ దృషికి తీసుకెళతున్నామని తెలిపారు. సమవేశానికి హాజరు కాని మండల అధికారులకు వెంటనే నోటీసులు జారీ చేస్తామన్నారు. ఏఓ రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మిధున్‌చక్రవర్తి, సర్వేయర్ గోపి, ఏపిమ్ మురళి, ఏపీఓ రమేష్, కార్యదర్శి గౌతమి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు రూ.3.40 లక్షలు విరాళం


ట్రస్టు సభ్యులకు చెక్కును అందచేస్తున్న రామకృష్ణారెడ్డి

తంబళ్లపల్లె, జూన్ 30(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లెకు సమీపంలోని మల్లయ్యకొండ మల్లికార్జున స్వామి అన్నదాన ట్రస్ట్ వంట షెడ్ నిర్మాణానికి కన్నెమడుగుకు చెందిన రామకృష్ణారెడ్డి, రవిశంకర్‌రెడ్డి రూ.3.40 లక్షల చెక్కును విరాళంగా అందజేశారు. ఆదివారం సాయంత్రం అన్నదాన ట్రస్టు చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, ట్రస్టు సభ్యులకు దాతలు చెక్కును అందజేశారు. ప్రతి ఏడాది మహాశివరాత్రి రోజున మల్లయ్యకొండకు వచ్చే భక్తులకు ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదానం చేస్తున్నారు. ఈ మొత్తాన్ని వంట షెడ్డు నిర్మాణానికి వినియోగించనున్నట్లు సభ్యులు తెలిపారు. ట్రస్టు సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, రామ్మూర్తి, కరీం, నారాయణరెడ్డి, రమణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, జయనారాయణరెడ్డి, నరసింహా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఏఈఈపై విచారణకు అధికారి నియామకం

కలికిరి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కురబలకోట మండలం అంగళ్లు ఏఈఈ బరిణేపల్లె వెంకటరత్నంపై విచారణకు సహక రించేందుకు కడప రేంజ్ ఏసీబీ ఇన్‌స్పెక్టర్ ఎన్.వి. నాగరాజును నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఆదేశాలు జారీ చేసింది. గత ఏడాది ఏప్రిల్ 30న ఏఈఈ వెంకటరత్నం లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు. ఈ వ్యవహారంపై విచారణ చేయాలని ఏసీబీ డైరెక్టర్ జనరల్ ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ఈ క్రమంలో విచారణాధికారి ముందు వెంకటరత్నంపై మోపిన అభియోగాలకు సంబంధించిన ఆధారాలను విచారణాధికారికి అందజేసి సహకరించాల్సి ఉంది దీని కోసం ఏసీబీ ఇన్‌స్పెక్టరు నాగరాజుకు ఈ బాధ్యతలు అప్పగించారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

లుంగీ కట్టు.. మాస్ లుక్!



కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా జంటగా జైన్స్ నాని తెరకెక్కిస్తోన్న చిత్రం 'కె-ర్యాంప్'. హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బేనర్లపై రాజేశ్ దండా, శివ బొమ్మకు నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. కిరణ్ అబ్బవరం లుంగీ కట్టులో మాస్, క్లాస్ కలసిన మేకోవర్‌లో ఆకట్టుకుంటున్నారు. బ్యాక్‌గ్రౌండ్‌లో మందు బాటిల్స్‌తో డిజైన్ చేసిన లవ్ సింబల్ కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఈ దీపావళికి విడుదల చేసేందుకు చిత్రబృందం సిద్ధమవుతోంది.

ఓటీటీలోకి 'తల్లి మనసు'



కమల్ కామరాజు, సాత్విక్, రచిత మహాలక్ష్మీ ప్రధాన పాత్రల్లో ముత్యాల సుబ్బయ్య తెరకెక్కించిన చిత్రం 'తల్లి మనసు'. ముత్యాల అనంత కిశోర్ నిర్మించారు. ఇటీవలె చిత్రం విడుదలైంది. తాజాగా, ఈ సినిమా ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్‌లోకి అందుబాటులోకి వచ్చిందని మేకర్స్ తెలిపారు.

పూజతో ప్రారంభం



తమిళ నటుడు విజయ్ సేతుపతి కథానాయకుడిగా పూరి జగన్నాథ్ ఓ చిత్రాన్ని తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. సోమవారం ఈ చిత్రాన్ని పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు మేకర్స్. విజయ్‌కుమార్, సంయుక్త, టబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. చార్మీ కౌర్ సమర్పణలో పూరి జగన్నాథ్, జేబీ నారాయణరావు కొండ్రోల్లా సంయుక్తంగా సినిమాను నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ప్రేక్షకులకు విభిన్నమైన అనుభూతిని ఈ సినిమా ద్వారా అందిస్తామని మేకర్స్ పేర్కొన్నారు. ఈ నెల నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుంది.

సున్నితమైన హాస్యంతో...



హీరో రాణా దగ్గుబాటి తన నిర్మాణ సంస్థ స్పిరిట్ మీడియా బ్యానర్‌పై రూపొందిస్తున్న చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. నూతన దర్శకురాలు ప్రవీణ పరుచూరి తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా గురించి మేకర్స్ మాట్లాడుతూ "సున్నితమైన హాస్యంతో నిండిన చిత్రమిది. అందర్నీ ఆలోచింపజేస్తుంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది" అని తెలిపారు. ప్రస్తుతం ఈ చిత్రం నిర్మాణ దశలో ఉంది.

కథలో భిన్న కోణాలుంటాయి


- శ్రీరామ్ వేణు



"తమ్ముడు' సినిమాలో కుటుంబ భావోద్వేగాలు, భిన్న కోణాలు ఉంటాయి. ట్రైలర్‌లో కథ ఎలా ఉండబోతుందో చెప్పాం' అని అన్నారు దర్శకుడు శ్రీరామ్ వేణు. నితిన్ హీరోగా ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'తమ్ముడు'. దిల్ రాజు, శిరీష్ నిర్మించారు. ఈ శుక్రవారం థియేటర్లలో విడుదలవుతున్న సందర్భంగా శ్రీరామ్ వేణు మీడియాతో మాట్లాడుతూ 'ఈ చిత్రానికి సెన్సార్ వాళ్లు కొన్ని కట్స్ చెప్పారు. మేము ఆ కట్స్ వద్దనుకున్నాం. సినిమాలో హీరోతోపాటు ఐదుగురు మహిళా క్యారెక్టర్లు బలంగా ఉంటాయి. 'విక్రమ్'లో కమల్ హాసన్ పాత్ర కథలో ఎలా ట్రావెల్ అవుతుందో అలా ఈ చిత్రంలోనూ ఉంటుంది. ఆర్చరీని కథలో చేర్చాలని చాలా సార్లు అనుకున్నాం. 'తమ్ముడు'లో కుదిరింది. ఆర్చరీ ట్రైనర్‌తో నితిన్‌కు 15 రోజులు శిక్షణ ఇప్పించాం. కథలో ప్రధానంగా బ్రదర్ సిస్టర్ సెంటిమెంట్ ఉన్నా అనేక కోణాల్లో మూవీ సాగుతుంది. 'కాంతారా' చూశాక సప్తమి గౌడ మా మూవీలోని క్యారెక్టర్‌కు బాగుంటుందని అనిపించి తీసుకున్నాం. మ్యూజిక్ డైరెక్టర్ అజనీష్ లోకనాథ్ మంచి బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఇచ్చారు.

ఓ దినపత్రికలో వచ్చిన ఆర్టికల్ స్ఫూర్తితో 'తమ్ముడు' కథను సిద్ధం చేసుకున్నా. కథ విని దిల్‌రాజు గారు బడ్జెట్ గురించి ఆలోచించకుండా నిర్మించారు. ఈ కథకు సరిపోయే హీరో కోసం వెతికాం. నితిన్ బాగుంటాడని తీసుకున్నాం. లయ పాత్ర కోసం ఒకప్పటి స్టార్ హీరోయిన్‌కి కథ చెప్పాం. ఆమెకు కథ, క్యారెక్టర్ నచ్చింది. కానీ ఆమె వ్యక్తిగత కారణాల వల్ల నటించలేదు. అయితే మరోసారి ఇలాంటి క్యారెక్టర్ వస్తే తప్పకుండా నటిస్తానని చెప్పారు. నా ప్రతి సినిమా ఒక కొత్త జానర్‌లో ఉంటుంది. నేనెప్పుడూ జానర్ రిపీట్ చేయలేదు. నా స్క్రిప్ట్‌లో ఫిమేల్ క్యారెక్టర్లకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ఇప్పటి దాకా అలా చేస్తూ వచ్చాను. తరవాత సినిమాకు ఎలా ఉంటుందో ఇప్పుడే చెప్పలేను' అని అన్నారు.

అల్లరి నరేశ్ 'ఆల్కహాల్'



హాస్య చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్న అల్లరి నరేశ్, వైవిధ్యభరితమైన చిత్రాలతోనూ తనదైన ముద్ర వేస్తున్నారు. అదే కోవలో మరో వైవిధ్యమైన చిత్రంతో అలరించడం కోసం సీతార ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో చేతులు కలిపారు. 'ఫ్యామిలీ డ్రామా' ఫేమ్ మెహర్ తేజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు 'ఆల్కహాల్' అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఫస్టలుక్ పోస్టర్ ఆకట్టుకుంటోంది. కాగా, అల్లరి నరేశ్ సరసన రుహాని శర్మ కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడించనున్నట్లు చిత్రబృందం పేర్కొంది.

సీనియర్ అసిస్టెంట్‌కు ఏవోగా పదోన్నతి


ఆర్డర్ కాపీని తీసుకుంటున్న పద్మావతి

కడప రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కొనిజేటి పద్మావతికి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(ఏవో)గా పదోన్నతి కల్పించారు. ఈ మేరకు ఆమెను బద్వేల్ పీఐయూ డివిజన్‌కు ఏవోగా నియమిస్తూ ప్లేస్ పోస్టింగ్ ఆర్డర్‌ను ఇచ్చారు. జూలై 1 మంగళవారం ఆమె ఏవోగా బాధ్యతలను చేపట్టనున్నారు. ఈ సందర్భంగా పరిపాలన విభాగం ఏవో భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను అనుసరించి సీనియారిటీ ప్రకారం జడ్పీ సీఈవో సి.ఓబులమ్మ అర్హులైన వారికి పదోన్నతులు కల్పిస్తున్నారన్నారు. సీఈవో ఆదేశాల మేరకు ఏవోగా పదోన్నతి పొందిన పద్మావతికి సోమవారం ఆర్డర్ కాపీని అందజేశామన్నారు. ఏపీపీఆర్ ఎంఈఏ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లంకామల్లేశ్వరెడ్డి, శ్రీనివాసులరెడ్డిలు అర్హత కలిగిన ఉద్యోగులకు సకాలంలో పదోన్నతులు కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రం, దేశాభివృద్ధి

● ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి

వేంపల్లె, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రానికి చెందిన ప్రాంతీయ పార్టీలు టీడీపీ, వైసీపీ, జనసేనలు బీజేపీ చేతిలో కీలు బొమ్మలు అని తెలిపారు. ప్రధాని మోదీ, బీజేపీ నాయకులు, సీఎం చంద్రబాబు పదేపదే ఎమర్జెన్సీ గురించి ప్రస్తావించడం, ఆ సాకుతో కాంగ్రెస్‌ను విమర్శించడం గర్హనీయమన్నారు. 1977లో ఎమర్జెన్సీ సమయంలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 42 స్థానాలకు గానూ 41 స్థానాల్లో తెలుగు ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించారని, ఎమర్జెన్సీని ఎత్తివేసిన తర్వాత 1978లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 294 స్థానాలకు గానూ 175 స్థానాల్లో గెలిచిందన్నారు. దేశంలో పరిస్థితులు బాగలేని కారణంగా రాజ్యాంగంలోని 352 అధికరణ ప్రకారం రాజ్యాంగబద్ధంగా ఇందిరమ్మ ఎమర్జెన్సీని ప్రకటించిందని, పరిస్థితులు చక్కబడగానే ఎమర్జెన్సీని ఎత్తివేసినట్లు తెలిపారు.

పనికి సమాన వేతనం ఇప్పించాలి

● మంత్రి పార్థసారథికి ట్రిపుల్‌ఐటీ గెస్ట్ ఫ్యాకల్టీ వినతి


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఫ్యాకల్టీలు

వేంపల్లె, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గెస్ట్ ఫ్యాకల్టీగా 2018లో చేరాం, ట్రిపుల్‌ఐటీలో ఎన్నో ఇబ్బందులు పెట్టారు. రెండేళ్లు తిరగకుండానే టీడీపీ ప్రభుత్వంలో చేరామనే అక్కసుతో తొలగించారు. కోర్టుకు పోయి మళ్లీ విధుల్లో చేరాం. పనికితగ్గ వేతనం ఇవ్వకుండా అన్యాయం చేశారు. కూటమి ప్రభుత్వంలోనైనా న్యాయం చేయాలని మంత్రి పార్థసారథికి ఆర్జీయూకేటీ గెస్ట్ ఫ్యాకల్టీ విజ్ఞప్తి చేశారు. విజయవాడలో ఉన్న మంత్రిని అసోసియేషన్ అధ్యక్షుడు నజీర్ హుస్సేన్, ఉపాధ్యక్షుడు మణికుమార్ తదితర ఫ్యాకల్టీ కలిసి వినతిపత్రం ఇచ్చారు. తమ తర్వాత చేరిన అధ్యాపకులకు రూ.33 వేలు వేతనం ఇస్తుండగా తమకు మాత్రం రూ.25వేలు మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. నెట్, సెట్ కోర్సుల సాకు చూపుతూ ఇంతవరకు అన్యాయం చేశారని తెలిపారు. ప్రభుత్వం 110 జీఓ ఇచ్చినప్పటికీ అమలు చేయలేదని, ఇప్పటికైనా న్యాయం జరిగేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రికి విన్నవించారు.

సుపరిపాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

● మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ బచ్చల పుల్లయ్య

ప్రొద్దుటూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏడాది కాలంగా అందిస్తున్న సుపరిపాలనను క్లస్టర్, యూనిట్ బూత్ ఇన్‌చార్జులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ బచ్చల పుల్లయ్య పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం స్థానిక భారత ఫంక్షన్ హాలులో నియోజకవర్గ స్థాయిలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను నెరవేర్చామని ప్రజలకు తెలియజెప్పాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఈవీ సుధాకరరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, టౌన్‌బ్యాంకు చైర్మన్ సుబ్బారెడ్డి, రాష్ట్ర వాల్మీకి బోయ కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజు, కేసీ కెనాల్ ప్రాజెక్టు వైస్ చైర్మన్ గురివిరెడ్డి, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలి

ప్రొద్దుటూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మహిళా సంరక్షణ కార్యదర్శుల బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలని ఆ సంస్థ అధ్యక్షురాలు అపర్ణ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం గాంధీ విగ్రహం వద్ద హోంమంత్రి అనిత చిత్రపటం వద్ద మహిళ సంరక్షణ కార్యదర్శులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా అపర్ణ మాట్లాడుతూ ప్రైవేటు ఉద్యోగులకు స్పౌజ్ కోటా వర్తింపజేసి 30 శాతం మందికి కౌన్సెలింగ్‌లో అధికారులు తీవ్ర అన్యాయం చేశారని విమర్శించారు. హోంమంత్రి అనిత జోక్యం చేసుకోని న్యాయం చేయాలని కోరారు.

అక్రమ కట్టడాన్ని అడ్డుకున్న అధికారులు

సీకేదిన్నె, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మామిళ్లపల్లె పంచాయతీలోని సర్వే నంబరు 39లో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను ప్రభుత్వ అధికారులు అడ్డుకున్నారు. బాబానగర్‌లో సోమవారం అక్రమ కట్టడాలు జరుగుతున్న విషయాన్ని స్థానికులు 'ఆంధ్రజ్యోతి' దృష్టికి తెచ్చారు. వెంటనే అక్రమ నిర్మాణాల సమాచారాన్ని తహసీల్దారు నాగేశ్వరరావు దృష్టికి తీసుకుపోవడంతో ఆయన వీఆర్వోను ఘటనా స్థలానికి పంపి అడ్డుకున్నారు. అదే విధంగా ఊటుకూరు పంచాయతీలోని సర్వే నంబరు 258 ఆక్రమణకు గురవుతున్న విషయాన్ని కూడా తహసీల్దారు దృష్టికి తేవడంతో వీఆర్వోను పంపించి జరిగిన విషయంపై ఆరా తీశారు.

శివారెడ్డి మరణం తీరని లోటు : సీపీఐ


శివారెడ్డికి నివాళులర్పిస్తున్న సంఘాల నేతలు

కడప సెవెన్‌రోడ్స్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సామాజిక కార్యకర్త పుత్తా శివారెడ్డి (65) ఆకస్మిక మరణం పౌర సమాజానికి తీరని లోటని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర అన్నారు. సోమవారం ఉదయం గుండెపోటుతో ఆకస్మికంగా మరణించడం పలువురిని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. బాలాజీనగర్‌లో వారి స్వగృహం వద్ద ఉన్న శివారెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి జిల్లా వ్యాప్తంగా పలువురు ఘనంగా నివాళులర్పించారు. పలువురు నాయకులు, అభిమానులు ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. కాగా శివారెడ్డి మృతదేహాన్ని పరీక్షల నిమిత్తం రిమ్స్‌కు అప్పగించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, నగర కార్యదర్శి ఎన్.వెంకటశివ, సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, హేతువాద సంఘం నాయకులు సీఆర్వీ ప్రసాద్, నాగార్జునరెడ్డి, విరసం, ప్రజానాట్య మండలి, నాస్తిక సంఘం, లోక్‌సత్తా, ఆప్ నేత, రాయలసీమ ఎస్సీ, ఎస్టీ మానవహక్కుల వేదిక నాయకులు జేవీ రమణ, రిటైర్డ్ అధికారులు, పౌరహక్కుల సంఘం నేతలు, జేవీవీ నాయకులు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, పలు ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వైద్యో నారాయణో హరి



● కనిపించే దైవమా నీకు వందనం
● నేడు జాతీయ వైద్యుల దినోత్సవం

కడప సెవెన్‌రోడ్స్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): "వైద్యో నారాయణో హరి" అంటే వైద్యుడు నారాయణుడితో సమానమని సుమతి శతకంలో రచయిత బద్దెన ఎంతో చక్కగా వివరించారు. వైద్యులు చేసే సేవలు, రోగులను కాపాడటం వంటి విషయాలను అందులో పేర్కొన్నారు. సృష్టి జీవం పోస్తే.. పునఃసృష్టి చేసేది మాత్రం వైద్యుడే. అటువంటి వారి గురించి ఎంత చెప్పినా తక్కువే. అంతెందుకు.. ప్రపంచాన్ని అల్లకల్లోలం చేసిన కరోనా సమయంలోనూ డాక్టర్లు కుటుంబాలను సైతం పక్కనపెట్టి సేవలందించారు. ఒక్కమాటలో చెప్పాలంటే.. భగవంతుడి తర్వాత చేతులెత్తి దండం పెట్టించుకునే ఒకే ఒక్కరు వైద్యుడు. నేడు జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

పశ్చిమ బెంగాల్ మొదటి ముఖ్యమంత్రి డాక్టర్ బిధన్ చంద్రరాయ్ జ్ఞాపకార్థం ప్రతి ఏడాది జూలై 1న జాతీయ వైద్యుల దినోత్సవాన్ని జరుపుతారు. ఈయన 1882 సంవత్సరం జూలై 1లో జన్మించినందున ఆయన సేవలకు గుర్తుగా స్మరించుకుంటారు. సమాజంలో వైద్యుల సేవలు ఎంతో విలువైనవి. వీరు రోగులకు మానసిక, శారీరక సాంత్వన చేకూరుస్తారు. నిరంతరం రోగులకు అందుబాటులో ఉంటూ, కుటుంబానికి సైతం ఖచ్చితమైన సమయాన్ని ఇవ్వలేక రోగి బాగోగుల గురించి పగలనక, రాత్రనక సేవలంది స్తుంటారు. కరోనా లాంటి వైరస్ విజృంభన సమయంలోనూ ప్రాణాలను సైతం లెక్కచేయక ఎందరో ప్రాణాలను కాపాడారు. అటువంటి వారిని గౌరవించాలి. కానీ నేటి పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని పలువురు వైద్యులు ఆవేదన చెందుతున్నారు. వైద్యుడు అంటే డబ్బులు గుంజే ఓ బిజినెస్ మెన్‌లా చూస్తున్నారని, తగిన గౌరవం ఇవ్వకపోగా తమపైనే దాడులు చేస్తున్నారని చెబుతున్నారు. రోగికి బాగలేనప్పుడు గోల్డెన్ అవర్‌లో వైద్యుల వద్దకు తీసుకెళ్తే కచ్చితంగా ఆ ప్రాణాన్ని కాపాడతారని, అలా చేయక సమయం దాటిన తర్వాత ఆసుపత్రులకు తీసుకొచ్చి మళ్లీ డాక్టర్లపైనే నిందలు మోపడం బాధిస్తుందని అంటున్నారు. ఏదేమైనా ప్రాణాలను కాపాడే వైద్యులను గౌరవించడం మన బాధ్యత.

వైద్యుల పట్ల గౌరవం ఉండాలి



- డాక్టర్ వెంకటేశ్వర్లు, సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్, కడప

గత 33 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో రోగులకు సేవలను అందిస్తున్నాను. గతంతో పోలిస్తే వైద్యుల పట్ల రోగుల వైఖరి మారింది. ఖచ్చితత్వ నాణ్యమైన వైద్యం అందించేందుకు కొన్ని రోగ నిర్ధారణ పరీక్షలు చేయాల్సి ఉంటుంది. ఆ పరిస్థితుల్లో వైద్యం ఖరీదైందని రోగుల భావిస్తుం టారు. నేడు అన్నిటిపై ధరలు పెరిగాయి. దానికి మేమేదో దోచుకుంటున్నామని నెపం వేయడం కరెక్టు కాదు. కరోనా వంటి విపత్కర సమయంలోనూ ప్రాణాలను, కుటుంబాలను పక్కన పెట్టి చికిత్స అందించాం. ఆయుష్షు ఉన్నంత వరకు రోగులకు సేవ చేయాలని ఆశిస్తున్నాను. వైద్యుల పట్ల మునుపటి గౌరవం ఉంటే బాగుంటుంది.

వెనుకంజలో కడప... అనంతపురం జట్లు


74 పరుగులు చేసిన తోషిత్‌యాదవ్ (నెల్లూరు)

కడపస్పోర్ట్స్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-19 మెన్స్ మల్టీడే (మూడురోజుల) క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా వివిధ జట్ల మధ్య సోమవారం సాగు తున్న మ్యాచ్‌లలో తమ ప్రత్యర్థి జట్లపై కడప, అనంతపురం జట్లు వెనుకంజలో వున్నాయి. వివరాలిలా...

కేఓఆర్ఎం మైదానంలో...

నగర శివారు ప్రాంత కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో నెల్లూరు- కడప జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లో టాస్ నెగ్గిన కడప జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 69.3 ఓవర్లలో 232 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో తోషిత్‌యాదవ్ 74 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 18 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 129 పరుగులు చేసింది. ఇందులో గురువిఘ్నేష్ 53 పరుగులు చేయగా రణధీర్‌రెడ్డి 47 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. దీంతో కడప జట్టు మరో 103 పరుగుల లోటుతో వెనుకంజలో వుంది. ఆటకు మంగళవారం రెండవరోజు.

ఏసీఏ మైదానంలో

నగర రిమ్స్ సమీపంలోని వైఎస్ రాజారెడ్డి క్రికెట్ మైదానంలో అనంతపురం-చిత్తూరు జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో టాస్‌నెగ్గిన చిత్తూరు జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగి 44 ఓవర్లలో 189 పరుగులకు కుప్పకూలింది. ఇందులో సాయిచరణ్ 55 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు తన మొదటి ఇన్నిం గ్స్‌లో ఆట ముగిసే సమయానికి 39 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 179 పరుగులు చేసింది. ఇందులో రెహాన్ 108 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. దీంతో మరో 10 పరుగుల వెనుకంజలో నిలిచింది. ఆటకు మంగళవారం రెండవరోజు.

ఏడాదిలో ముగ్గురు కమిషనర్లు మారారు

● మున్సిపాలిటీ అభివృద్ధి ఎలా సాగుతుంది
● ప్రశ్నించిన ప్రొద్దుటూరు మున్సిపల్ వైస్ చైర్మన్

ప్రొద్దుటూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): "కూటమి ప్రభుత్వం వచ్చాక ఏడాదిలో ముగ్గురు కమిషనర్లు మారారు, 15 నెలలుగా కాంట్రాక్టర్లకు రూ.23 కోట్ల బిల్లులు చెల్లించలేదు. ఇంక మున్సిపాలిటీ లో అభివృద్ధి ముందుకు ఎలా సాగుతాయి? కనీసం 6 నెలలుగా వార్డుల్లో దోమల మందు కూడా పిచికారి చేయని దుస్థితి నెలకొంది" అంటూ మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారు రెడ్డి, కౌన్సిలర్ ఇర్ఫాన్ బాషా ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం స్థానిక మున్సిపల్ సభాభవనంలో చైర్ పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి అధ్యక్షతన జరిగింది. ఈసభలో కౌన్సిల్ సభ్యులు మాట్లాడుతూ ప్రజల నుంచి కోట్ల రూపాయల పన్నులు రాబడుతున్న మీరు ప్రజలకు పన్నులో మినహాయింపు ఇస్తారా అని నిలదీశారు. కోట్ల నిధులున్నా మున్సిపాలిటీలో మురుగునీటి వ్యవస్థ అధ్వాన్నంగా ఉందన్నారు. వైస్ చైర్మన్ బంగారు రెడ్డి, కౌన్సిలర్ వంశీధర్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక ఒక్క రూపాయ అభివృద్ధి పని అయినా మొదలు పెట్టారా అని ప్రశ్నించారు. కౌన్సిలర్ జిలాన్ మాట్లాడుతూ మున్సిపాలిటీ అద్దెగదులకు బాడుగలు వసూళ్లలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఆక్రమణలను ప్రోత్సహించేలా మీ చర్యలున్నాయని బంగారురెడ్డి ఆగ్రహించారు. ఈ అంశంపై చాలా సేపు చర్చ సాగింది. మున్సిపల్ కమిషనర్ చింతా రవిచంద్రారెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీకి వచ్చి పదిహేను రోజులైందన్నారు. త్వరలో కాంట్రాక్టర్ల బిల్లులతో సహా అభివృద్ధి పనులు వేగవంతం అవడానికి కృషి చేస్తానన్నారు. అనంతరం 12 అంశాల అజెండాపై చైర్‌పర్సన్ ఆమోదం తెలిపారు.

బడికోసం పిల్లల పోరాటం


గ్రామస్థులు, తల్లిదండ్రులతో కలిసి ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు

కడప సెవెన్‌రోడ్స్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): స్కూల్ విలీనం వద్దు మా ఊర్లోనే మా బడి కొనసాగించాలి అంటూ చిన్నారులు సోమవారం కలెక్టరేట్‌లో వినతి అందించారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద చిన్నారులు గ్రామస్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. అట్లూరు మండలం ఎస్.వెంకటాపురం (రంగంపల్లె) గ్రామానికి చెందిన ఊర్లో ఒకటి నుంచి ఐదవ తరగతి వరకు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉందన్నారు. స్కూల్స్ విలీనంలో భాగంగా చెన్నేపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 3వ తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థులను కుంభగిరి పంచాయతీ ఎస్.వెంకటాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విలీనం చేశారన్నారు. అయితే విలీనం తమకు వద్దు అంటూ విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు కోరారు.

అజిత్‌రెడ్డికి గోల్డ్ మెడల్



కమలాపురం రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చదిపిరాళ్ల గ్రామానికి చెందిన చాగారి చంద్ర ఓబుళ్‌రెడ్డి కుమారుడు చాగారి అజిత్‌రెడ్డి ఫెన్సింగ్ క్రీడలో ప్రతిభ కనబరిచి విజయం సాధించారు. జూన్ 29వ తేదీన విజయవాడలో నిర్వహించిన అండర్-12 ఫెన్సింగ్ క్రీడలో స్టేట్ చాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబరచి గోల్డ్‌మెడల్ పొందాడు. దీంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

మంత్రి లోకేశ్‌కు ఫిర్యాదు

కలసపాడు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కలసపాడులోని పార్టీ కార్యాలయంలో ఈ నెల 26న జరిగిన గొడవలో పోలీసులు తనను వేధించడంపై మంత్రి నారాలోకేశ్‌కు ఫిర్యాదు చేసినట్లు టీడీపీ నాయకుడు ప్రహ్లాద్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు విజయవాడలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మంత్రి లోకేశ్‌ను కలిసి వివరించినట్లు తెలిపారు. స్పందించిన మంత్రి జరిగిన సంఘటనపై విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

దంపతులపై దాడి... కేసు నమోదు

పులివెందుల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భాకరాపురం ప్రాంతంలో నివాసముంటున్న దంపతులపై పక్కింటి వారు దాడి చేసిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ నారాయణ వివరాల మేరకు.. దేవిరెడ్డి సరస్వతి, శివశంకర్‌రెడ్డి దంపతులు కాగా వీరి ఇంటి పక్కనే పవన్ కుమార్ రెడ్డి నివాసముంటున్నాడు. అతని ఇంటి ఆవరణంలో కొబ్బరి చెట్టు ఉండడంతో వాటి వేర్లు ప్రహరీగోడ కిందకు వచ్చి గోడ కూలిపోయే పరిస్థితికి చేరింది. వాటి చెట్టు కొమ్మలు కూడా ఇంట్లో పడుతున్నాయని పవన్‌కుమార్‌రెడ్డికి పలుమార్లు తెలియజేశారు. దీన్ని సహించలేని పవన్‌కుమార్‌రెడ్డి తన కొడుకు సందీప్‌కుమార్‌రెడ్డితో కలిసి దంపతులను నేరుగా ఇంట్లోకి వెళ్లి కట్టెలతో దాడి చేశారన్నారు. ఈ దాడిలో సరస్వతికి స్వల్ప గాయాలు కాగా శివశంకర్‌రెడ్డికి పలుచోట్ల తీవ్ర గాయాలై కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స పొందుతున్నట్లు ఎస్ఐ తెలిపారు. దీనిపై సరస్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోండి

● ప్రభుత్వానికి ఓ వృద్ధుడి వేడుకోలు


పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న వెంకటసుబ్బారెడ్డి

కడప మారుతీనగర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె మండలం బుగ్గిలేటిపల్లెలో గత 2009లో తాము కొనుగోలు చేసిన 77 సెంట్ల భూమిని సదరు మండలం లింగారెడ్డిపల్లెకు చెందిన ఇద్దరు వ్యక్తులు కబ్జా చేసేందుకు కుట్రపన్ని మమ్మల్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని గజ్జల వెంకటసుబ్బారెడ్డి అనే వృద్ధుడు ఆరోపించారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనకు ముగ్గురు కుమార్తెలని, కుమారులు లేకపోవడంతో వృద్ధాప్యంలో ఆసరాగా వుంటుందనే ఆశతో తమ బంధువుల దగ్గర నుంచి ఆ భూమిని కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. ఇదిలా వుండగా ఆ భూమిని కొందరు ఆక్రమించేందుకు కుట్రపన్ని బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. ఈ విషయంపై సీకే దిన్నెపోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వారు భూ రికార్డులు పరిశీలించి తమకే న్యాయం చేశారన్నారు. అయినప్పటికీ ఆక్రమణదారులు వినకుండా పెద్ద మనుషులతో పంచాయితీ చేయించి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, జిల్లా అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. ఈయన వెంట బాధితుడి భార్య గజ్జల జయలక్ష్మమ్మ పాల్గొన్నారు.

ఆర్థిక పరిపుష్టి అవగాహన పోస్టర్ల ఆవిష్కరణ

కడప కలెక్టరేట్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): సంతృప్తికరమైన ఆర్థిక పరిపుష్టిపై 3 నెలల పాటు నిర్వహించే క్యాంపెయిన్‌కు సంబంధించి కేంద్ర, ఆర్థిక మంత్రిత్వ శాఖ, బ్యాంకింగ్ రంగం ప్రచురించిన పోస్టర్లను జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ సోమవారం ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో జేసీ మాట్లాడుతూ సమాజంలో ప్రతి కుటుంబానికి ఆర్థిక పరిపుష్టి చేకూరేలా జిల్లాలో ఆర్థిక అక్షరాశ్యతను పెంపొందించడంతో పాటు బ్యాంకింగ్ యాక్సెస్‌ను విస్తరిస్తున్నామన్నారు. డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహిస్తున్నామన్నారు. ప్రజలను ఆర్థికంగా చైతన్యవంతం చేయడం, సామాజికంగా శక్తివంతం చేయడంలో జిల్లా యంత్రాంగం, బ్యాంకర్లు ఆయా శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

తండ్రి కొడుకు అదృశ్యంపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): తండ్రి కొడుకు అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు మదనపల్లె తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. పోలీసుల కథనం మేరకు సోమవారం రంగారెడ్డి కాలనీలో కాపురం ఉంటున్న మునిరత్నం(43), అతని కుమారుడు మనోజ్(7) ఈ నెల 23 నుంచి కనపడటం లేదని అతని భార్య ఆదెమ్మ ఫిర్యాదు చేసింది. మునిరత్నం కూలీ పనులు చేసుకొంటూ జీవించేవాడని, తాగడానికి భార్య డబ్బులు ఇవ్వలేదని గొడవపడి ఈ నెల 23న తన కుమారుడిని పిలుచుకుని ఇంట్లో నుంచి వెళ్లిపోయాడని మళ్లీ తిరిగి రాలేదని భార్య తెలిపినట్లు పోలీసులు తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ ఎరిసావల్లి తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. విజయకుమార్ మగ్గం నేస్తూ జీవిస్తున్నారని, ఇటీవల సుండుపల్లెకు చెందిన మాధవి(20)అనే యువతితో వివాహం జరిగిందని, వారు మదనపల్లె పట్టణం విజయనగర్ కాలనీలో కాపురం ఉంటున్నట్లు చెప్పారు. అయితే ఈ నెల 26న ఆ యువతి ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదని సోమవారం ఆమె భర్త వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెళ్లిపోవడానికి కారణం తెలియరాలేదని చెప్పారు. యువతి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

తప్పుడు ప్రచారాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోండి

● ఎస్పీకి ఫిర్యాదు చేసిన సుజన కుటుంబ సభ్యులు

రాయచోటిటౌన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): తమ కుమార్తె మృతి విషయంలో కుటుంబంపై తప్పుడు ప్రచారాలు చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సోమవారం రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని మిట్టవాండ్లపల్లెకు చెందిన ఉత్తయ్య కుటుంబ సభ్యులు ఎస్పీ విద్యాసాగర్‌నాయుడుకు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు ఎస్పీ కార్యాలయం ఎదుట మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 11న తమ రెండవ కుమార్తె సుజన ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుందని, తమ కుమార్తె మృతికి కారణమైన తారకరత్నపై రాయచోటి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందన్నారు. కానీ కొందరు కలుగజేసుకొని ఈ కేసు నుంచి తప్పించడానికి కుట్రలు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికైనా తమ కుమార్తె ఆత్మహత్య కేసును సమగ్రంగా విచారించి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉత్తయ్య కుటుంబ సభ్యులు ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో విజ్ఞప్తి చేశారు.

స్థాయి పెరిగినా... సమస్యలు తీరడం లేదు

అభివృద్ధి పనులపై కౌన్సిలర్ల అసంతృప్తి ● ప్రారంభమైన పది నిమిషాలకే విరామం

ఇంజనీరింగ్, వాటర్ వర్కర్స్ బైఠాయింపు, నిరసన ● కార్మికుల వేతనాలు చెల్లింపునకు కౌన్సిల్ ఆమోదం

స్థాయి పెరిగినా సమస్యలు తీరడంలేదు. పట్టణం అభివృద్ధి పనులపై కౌన్సిల్ అసంతృప్తిగా ఉంది. పట్టణం అభివృద్ధి చేపట్టేందుకు వ్యయ ప్రయాసల కోర్చి నిర్వహించే సమావేశాన్ని ప్రారంభించిన పదినిము షాలకే విరామం ప్రకటించడం హాస్యాస్పదంగా ఉంది. మున్సిపల్ ఇంజనీరింగ్, వాటర్ వర్కర్స్ బైఠాయించి నిరసన చేపట్టారు. తమ సమస్యలను తీరుస్తామని కౌన్సిల్ సమావేశంలో హామీ ఇవ్వడంతో ఆందోళనలు విరమించారు.

మదనపల్లె అర్బన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీకి స్థాయి పెరిగినా అధికారులు, సిబ్బంది కొరత. సమస్యలు చెప్పుకొన్నా... పరిష్కారం కావడం లేదు. అభివృద్ధి కూడా లేదని కౌన్సిలర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. మరో ఎనిమిది నెలల్లో పాలకవర్గం పదవీకాలం అయిపోతుందని, ఈ నాలుగున్నరేళ్లలో వెనక్కి తిరిగి చూసుకుంటే సాధించేందేమీ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం చైర్పర్సన్ మనూజ అధ్యక్షత కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఉద్యోగుల బదిలీల విషయమై కౌన్సెలింగ్‌కు కమిషనర్ కె.ప్రమీల చిత్తూరుకు వెళ్లడంతో తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని కౌన్సిలర్ నాగార్జున బాబు ప్రశ్నించారు. సెలెక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీ అయినా.. స్థాయికి తగినట్లు ఇక్కడ అభివృద్ధి పనులు జరగడం లేదని నాగార్జున బాబుతో మిగిలిన కౌన్సిలర్లు స్వరం కలపడంతో సమావేశం కొంత సేపు వాయిదా పడింది. తర్వాత మళ్లీ ప్రారంభం కాగా, కార్యాలయం ముందు సమ్మె చేస్తున్న ఇంజనీరింగ్ కాంట్రాక్ట్ కార్మికులు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కౌన్సిల్ హాలులోకి వచ్చి చైర్పర్సన్‌కు అందజేశారు. తర్వాత కౌన్సిల్ హాలు ముందు బైఠాయించి నినాదాలు చేశారు. నెలరోజులుగా తాము సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని, దీనిపై అధికారులు, చైర్పర్సన్ వచ్చి వివరణ ఇవ్వాలని పట్టుపట్టారు. ప్రభుత్వం ఇస్తున్న రూ.18,500లకు అదనంగా మరో రూ.5వేలు పెంచి వేతనం సాధారణ నిధుల




సమస్యలు వివరిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ నూర్‌ఆజాం - మాట్లాడుతున్న మున్సిపల్ చైర్పర్సన్ మనూజ

నుంచి ఇచ్చేలా కౌన్సిల్ తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపుతామని కార్మికులకు సమావేశం అనంతరం చైర్పర్సన్ సహా కౌన్సిలర్లు హామీ ఇచ్చారు. ఆ మేరకు కౌన్సిల్‌లో తీర్మానం చేయడంతో వారు ఆందోళన విరమించారు.

కౌన్సిలర్ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ మున్సిపాలిటీలో కాంట్రాక్టర్లు చేసిన పనులకు బిల్లులు ఇవ్వకపోవడంతో ఏడాదిగా మున్సిపాలిటీలో పనులు ఆగిపోయినట్లు తెలిపారు. మున్సిపల్ కార్యాలయం వద్ద ఇంజనీరింగ్ కార్మికులు 27 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. పట్టణ విస్తీర్ణానికి తగినట్లు కార్మికులు లేకపోవడంతో శానిటేషన్ అస్తవ్యస్తంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వైస్‌చైర్మెన్ జింకా వెంకటాచలపతి మాట్లాడుతూ ప్రతిపక్ష హోదాలో టీడీపీ కార్మికులకు ఎన్నో హామీలు ఇచ్చినా అధికారంలోకి వచ్చి ఏడాదైనా చేసిందేమీ లేదని విమర్శించారు. ఇంజనీరింగ్, దినసరి శానిటరీ కార్మికుల జీవన ప్రమాణాలు పెరిగేలా ప్రభుత్వంపై అదనపు భారం పడకుండా మున్సిపల్ సాధారణ నిధుల నుంచి కొంతభరిస్తామని, ఈ మేరకు ప్రభుత్వానికి కౌన్సిల్ తీర్మానించి పంపుతామని హామీ ఇచ్చారు. పట్టణంలో శానిటేషన్ అధ్వానంగా ఉందని, ఒక వార్డు నుంచి మరో వార్డుకు కార్మికులను శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణు మళ్లించడమే కారణమన్నారు. ఫలితంగా పారిశుధ్యం లోపించి ప్రజలు విషజ్వరాలు, అంటురోగాల భారిన పడుతున్నట్లు ఆరోపించారు.

హిందూ శ్మశాన వాటికను మున్సిపాలిటీ తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని జింకా అసహనం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలో అధికారుల సీట్లు ఖాళీ కుర్చీలే కనిపిస్తాయని ఏమని ప్రశ్నించినా ఫీల్డ్ వర్క్‌లో ఉన్నారనే సమాధానం వస్తోందన్నారు. సచివాలయంలో 15 రోజులుగా ఉద్యోగులు పనులు చేయకుండా కౌన్సెలింగ్ అంటూ మాటలు చెబుతున్నారని ఆరోపించారు. అనంతరం దినసరి మార్కెట్‌ను గేటు వసూళ్ల రోజువారీ వివరాలను చైర్పర్సన్‌కు అందజేశారు. అంతకముందు తమకు న్యాయం చేయాలని మున్సిపల్ ఇంజనీరింగ్ కాంట్రాక్టు కార్మికులు సమావేశం నుంచి ఎవరూ బయటకు రాకుండా బైఠాయించి నిరసన చేపట్టారు. చివరకు సమస్యలు పరిష్కరిస్తామన్న హామీతో ఆందోళన విరమించారు. చివరకు అజెండాలో రెండు అంశాలు మినహా మిగిలిన అంశాలకు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. మున్సిపల్ వైస్‌చైర్మన్ బి.ఎ.నూర్ ఆజాం, మరికొందరు కౌన్సిలర్లు వార్డు సమస్యలు, చేపట్టని పనులను ఏకరువు పెట్టారు.

నిషేధిత జాబితా నుంచి తొలగించండి



ప్రజల అర్జీలను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె టౌన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మాకున్నది ఎకరా భూమి కూతురు పెళ్లి కోసం అప్పు చేద్దామంటే బ్యాంకులో అప్పు పుట్టడం లేదు. మా భూమిని నిషేధిత(22-ఏ) జాబితాలో వుంచారని బ్యాంకులు తిరస్కరిస్తున్నాయి. దయచేసి మా భూములను 22-ఏ నుంచి తొలగించాలని పలువురు రైతులు సబ్‌కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో సోమవారం సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో పలువురు బాధితులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. తమ భూమి నిషేధిత జాబితాలో వుందని బ్యాంకులు అప్పు ఇవ్వడం లేదని మదనపల్లె మండలం రంగారెడ్డికాలనీ వాసి నయీమ్ అక్తర్ సబ్‌కలెక్టర్‌కు విన్నవించారు. తాను 2.97 ఎకరాల భూమి కొనుగోలు చేశానని, అందులో విద్యుత్‌శాఖ ఇప్పుడు కొత్త పెద్దలైన్ వేస్తున్నారని, ఇది వేస్తే తాను ఎక్కువ భాగం భూమి కోల్పోతానని నిమ్మనపల్లె మండలానికి చెందిన పి.అలివేలు విన్నవించారు. 20ఏళ్లగా తాము అద్దె ఇంట్లో నివసిస్తున్నామని, ప్రభుత్వం తమకు పక్కా ఇంటి స్థలం, హౌసింగ్ రుణం మంజూరు చేయాలని మదనపల్లె పట్టణం నక్కలదిన్నెకు చెందిన బి.లలిత విన్నవించుకుంది. మ్యుటేషన్లు, సర్వే సమస్యలపై 102 అర్జీలు అందజేశారు.

నర్సింగ్ రంగంలో అపార ఉపాధి అవకాశాలు



సమావేశంలో మాట్లాడుతున్న పురం రామ్మూర్తి

పీలేరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): నర్సింగ్ రంగంలో మహిళలకు అపార ఉపాధి అవకాశాలు ఉన్నాయని పీలేరు ఏఎంసీ చైర్మన్ పురం రామ్మూర్తి వివరించారు. ఇన్ఫోసిస్ సంస్థ సహకారంతో నిర్మాణ్, ఎడ్యు బ్రిడ్జి సంస్థల ఆధ్వర్యంలో పీలేరులోని బాలాజీ పారామెడికల్ ఇన్‌స్టిట్యూట్‌లో ఉచిత నర్సింగ్ శిక్షణ తరగతులను సోమవారం లాంఛనంగా ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణ పట్ల సామాన్యుల్లోనూ అవగాహన, అవసరం పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో నర్సింగ్ రంగానికి ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. ఇన్ఫోసిస్ లాంటి ప్రతిష్ఠాత్మక సంస్థ అందిస్తున్న ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన యువతకు సూచించారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్ చిరంజీవి మాట్లాడుతూ ఇంటర్ పాసైన 18-26 ఏళ్ల మధ్యనున్న నిరుద్యోగ యువతకు నర్సింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తామని, జూలై 1వ తేదీ నుంచి రెగ్యులర్ క్లాసులు ప్రారంభమవుతాయని, ఆసక్తి గల వారు తమ ఆధార్, రేషన్ కార్డులు, విద్యార్హత సర్టిఫికెట్లతో పీలేరు క్రాసు రోడ్డులోని బాలాజీ పారా మెడికల్ ఇన్‌స్టిట్యూట్‌లో నేరుగా సంప్రదించాలని తెలిపారు. శిక్షణ అనంతరం అందరికీ ఉచితంగా ప్లేస్‌మెంట్ కల్పిస్తామన్నారు. అనంతరం శిక్షణ తరగతులు విధివిధానాలు, నర్సింగ్ రంగంలో ఉన్న ఉపాధి అవకాశాలు, వేతనాల గురించి వివరించారు. కార్యక్రమంలో షైన్ సంస్థ అధ్యక్షులు బాబ్‌జాన్, కరస్పాండెంట్ బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ఈఆర్ఓ కేంద్రం



వాల్మీకిపురంలో విద్యుత్ బిల్లుల వసూళ్ల కేంద్రం ప్రారంభిస్తున్న డీఈఈ

వాల్మీకిపురం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ కేంద్రం ద్వారా పరిష్కరించుకోవచ్చని డీఈఈ చంద్రశేఖర్‌రెడ్డి వివరించారు. ఎన్నో ఏళ్లగా పట్టణ ప్రజలకు సౌకర్యంగా ఉంటున్న ఈఆర్‌ఓ కేంద్రం గతంలో కలికిరికి తరలించేశారు. దీనిపై పట్టణ ప్రజల వినతి మేరకు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక చొరవతో తిరిగి ఆ కేంద్రాన్ని వాల్మీకిపురంలోనే ఉండేలా చర్యలు చేపట్టారు. ఈనేపథ్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద విద్యుత్ బిల్లుల వసూళ్లు, ఫిర్యాదుల విభాగ కేంద్రం భవనాలను ఆయన ప్రారంభించారు. విద్యుత్ వినియోగదారులు ఎలాంటి సమస్యలున్నా ఈకేంద్రం ద్వారా విన్నవించుకుని పరిష్కరించుకునేందుకు మంచి అవకాశం కల్పించామన్నారు. కార్యక్రమంలో ఏడీఈఈ శివయ్య, ఏఈఈ రాజశేఖర్, జేఏఓ గంగాధర్‌రెడ్డి, రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ, మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, ట్రాన్స్‌కో సబ్ ఇంజనీర్ జాకీర్‌హుస్సేన్, నేతలు, కార్యకర్తలు, ట్రాన్స్‌కో సిబ్బంది పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు ఘనంగా వీడ్కోలు

పీలేరు/నిమ్మనపల్లి/గుర్రంకొండ/కలకడ/రామసముద్రం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ చెందిన పలువురు ఉపాధ్యాయులు, ఉద్యోగులకు సోమవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఎల్‌బీఎస్ రోడ్డు యూపీ స్కూల్ హెచ్‌ఎం బాలకృష్ణారెడ్డిని టీడీపీ నేతలు సన్మానించారు. పీలేరు మెయిన్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్. సురేంద్రనాథరెడ్డి, సోషియల్ అసిస్టెంట్ రవీంద్రారెడ్డిని పాఠశాల అధ్యాపక బృందం సన్మానించి వీడ్కోలు పలికింది. ఎనుములవారిపల్లె సైన్స్ అసిస్టెంట్ జే. సూర్యప్రకాష్, రాయలవారిపల్లె టీచర్ సుబ్బారెడ్డిని సన్మానించి వీడ్కోలు పలికారు. నిమ్మనపల్లి జడ్పీహైస్కూల్ ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు సహదేవరెడ్డికి ఉపాధ్యాయులు, విద్యార్థులు వీడ్కోలు పలికారు. గుర్రంకొండ ఎంపీడీఓ వెంకటేశులను ఉద్యోగులు, నేతలు సన్మానించి వీడ్కోలు పలికారు. కలకడ మండలం బాటవారిపల్లె జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు వై.వి.రమణను అధ్యాపక బృందం సన్మానించింది. ఎర్రయ్యగారిపల్లె పాఠశాల ఉపాధ్యాయుడు ఎం.ఎస్.ఖాజాపీర్‌కు పాఠశాల బృందం వీడ్కోలు పలికింది. రామసముద్రం మండలం పెద్దకురప్పల్లి పంచాయతీ కార్యదర్శి కె.సురేంద్రబాబును ఎంపీడీఓ భానుప్రసాద్ సెక్రటరీలు సన్మానించారు.

ఏం తినాలి... ఎలా బతకాలి ?

● మినరల్ వాటర్ ప్లాంట్ వర్కర్ల నిరసన ● పెండింగ్ జీతాలు కోరుతూ వినతి

పీలేరు రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): అదిగో ఇదిగో అంటూనే నెలలు గడిపేస్తున్నారు, ఇంకెప్పుడిస్తారో స్పష్టత లేదు తాము ఏమి తినాలి... ఎలా బతకాలి అంటూ ఎంపీడీఓ కార్యాలయం వద్ద మినరల్ వాటర్ ప్లాంట్ల వర్కర్లు నిరసన తెలిపారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద పట్టణంలోని మినరల్ వాటర్ ప్లాంట్ల వర్కర్లు జీతాలు ఇవ్వడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కనీసం ఎప్పుడు ఇస్తారనే సమాచారం కూడా లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. డిప్యూటీ ఎంపీడీఓ, పీలేరు మేజర్ పంచాయతీ ఇన్‌చార్జి ఈఓ లతీఫ్ ఖాన్‌కు వినతి పత్రం సర్పించారు. దీనిపై స్పందించిన ఆయన మినరల్ వాటర్ ప్లాంట్ల తాళాలు ఇచ్చేయండి, మీ పెండింగ్ జీతాలు త్వరలోనే చెల్లిస్తామన్నారు. ప్లాంట్ల నిర్వహణ పంచాయతీకి భారంగా మారిందని, ఇకపై పంచాయతీ వాటర్ వర్కర్లచే మినరల్ వాటర్ ప్లాంట్లు రన్ చేయిస్తామన్నారు. ఇవ్వాల్సిన పెండింగ్ జీతాలు ఇచ్చిన వెంటనే ప్లాంట్ల తాళాలు ఇచ్చేస్తామని వర్కర్లు తేల్చిచెప్పారు. ఆర్థిక ఇబ్బందులతో పెండింగ్ జీతాలు అడిగితే ఇవ్వకుండా ప్లాంట్ల నిర్వహణ బాధ్యతల



పీలేరు ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న మినరల్ వాటర్ ప్లాంట్ల వర్కర్లు

నుంచి తొలగిస్తామని బెదిరించడమేమిటని పలువురు ప్రశ్నించారు. రెండు నెలలుగా మినరల్ వాటర్ ప్లాంట్ల నిర్వహణకు అవసరమైన మెటీరియల్ సైతం ఇవ్వడం లేదని వర్కర్లు ఆరోపించారు. ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డితో చర్చించి వీలైనంత త్వరగా జీతాలు ఇవ్వడానికి ప్రయత్నిస్తానని డిప్యూడీ ఎంపీడీఓ హామీ ఇవ్వడంమతో వర్కర్లు వెనుతిరిగారు.

మహిళా సాధికారత సాధించాలి

కలికిరి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): సర్పంచుగా పరిపాలనా పగ్గాలు చేపట్టిన మహిళలు పరిపాలనలో మహిళా సాధికారత సాధించాలని అధికారులు సూచించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల మహిళా సర్పంచులకు కలికిరి ఎంపీడీఓ సమావేశ భవనంలో సోమవారం మూడు రోజుల శిక్షణ ప్రారంభించారు. ఎంపీడీఓ భానుమూర్తి రావు, డిప్యూటీ ఎంపీడీఓ రియాజుద్దీన్ మాట్లాడుతూ పురుషులకు ఏమాత్రం తీసిపోని విధంగా మహిళా సర్పంచులు పాలనలో సమర్థవంతమైన ముద్ర వేయాలని సూచించారు. ప్రధానంగా గ్రామాల్లో మహిళలకే సమస్యలపట్ల కూలంకశమైన అవగాహన వుంటుందని వాటిని గుర్తెరిగి పాలన సాగించాలన్నారు. మొదటి రోజు శిక్షణలో మహిళా నాయకత్వంలో మార్పు, స్థానిక స్వపరిపాలనలో సాధికారిత, లింగ భేదాలకు అతీతంగా పరిపాలన, పితృస్వామ్య వ్యవస్థపై అవగాహన, లింగ ఆధారిత బాధ్యతల విభజన, 73 రాజ్యాంగ సవరణ విశేషాలు, స్థానిక పాలనలో మహిళలకున్న ప్రధాన అవకాశాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ట్రైనింగ్ రిసోర్స్ పర్సన్‌గా గుర్రంకొండ



మహిళా సర్పంచులకు సూచనలిస్తున్న భానుమూర్తి రావు, రియాజుద్దీన్

డిప్యూటీ ఎంపీడీఓ బ్రహ్మానంద రెడ్డి, కురబలకోట పంచాయతీ కార్యదర్శి శేషగిరిరావు శిక్షణ నిర్వహించారు. జిల్లా శిక్షణ కేంద్రం నుంచి హాజరైన మధుసూదన్ శిక్షణ తరగతులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏఓ సురేంద్రబాబు, రిసోర్స్ కోఆర్డినేటర్ శంకర్, సిబ్బంది ప్రదీప్ రెడ్డి, మహ్మద్ సయీద్, సుమియా తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో సత్రం నిర్మాణానికి సహకరించండి

● పుదుచ్చేరి సీఎంను కలిసిన సభ్యులు

పీలేరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): తమ సంఘ ఆధ్వర్యంలో శ్రీశైలంలో నిత్యాన్నదాన సత్రం నిర్మాణానికి జరుగుతున్న ప్రయత్నాలకు సహకరించాలని రాయలసీమ అగ్నివన్నె కుల క్షత్రియ సేవా సంఘం సభ్యులు పుదుచ్చేరి ముఖ్యమంత్రి రంగస్వామికి విజ్ఞప్తి చేశారు. పుదుచ్చేరిలోని ముఖ్యమంత్రి నివాసంలో సంఘం నేతలు ఆదివారం ముఖ్యమంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ విషయమై రాయలసీమ అగ్ని వన్నెకుల క్షత్రియ సంఘం అధ్యక్షుడు బలరాం సోమవారం పీలేరులో మాట్లాడుతూ తమ సంఘం ఆధ్వర్యంలో శ్రీశైలంలో నిత్యాన్నదాన సత్రం నిర్మించడానికి ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లోని అగ్నివన్నె కుల క్షత్రియ ప్రజాప్రతినిధులతో కలిసి కృషి చేస్తున్నామన్నారు. అదే అంశంలో మద్దతు సమీకరించడానికి పుదుచ్చేరి ముఖ్యమంత్రి రంగస్వామిని కలిసి విజ్ఞప్తి చేశామని, ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. దక్షిణ భారతదేశంలో ఉన్న అగ్నివన్నె కుల క్షత్రియ ప్రజా



ముఖ్యమంత్రి రంగస్వామిని సత్కరిస్తున్న అగ్నివన్నె కుల క్షత్రియ సేవా సంఘం సభ్యులు

ప్రతినిధులు, మాజీ ప్రతినిధులు, అధికారులు, వ్యాపారవేత్తలతో కలిసి త్వరలోనే సమావేశం ఏర్పాటు చేసి అందుకు తగిన కార్యాచరణ సిద్ధం చేసేందుకు సాయం చేస్తానని రంగస్వామి హామీ ఇచ్చారని బలరాం తెలిపారు. కార్యక్రమంలో సంఘ నేతలు జ్ఞానేందర్, మునస్వామి, మణి, వడివేలు తదితరులు పాల్గొన్నట్లు ఆయన తెలియజేశారు.

వైభవంగా రుద్రాభిషేకం



వాల్మీకిపురం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): స్థానిక కోనేటివీధిలో వెలసిన లక్ష్మీకామేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో కామేశ్వరస్వామికి పంచామృత, క్షీర, రుద్రాభిషేకాలు నిర్వహించి విశేషాలంకరణలతో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ధర్మకర్త కువైట్ శంకరాచారి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

యోగభోగేశ్వరుడికి రుద్రాభిషేకం



మదనపల్లె అర్బన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక మడికయ్యల శివాలయంలో వెలసిన యోగభోగేశ్వరుడికి సోమవారం ఆలయ అర్చకుడు రుద్రాభిషేకం నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్ర సాదాలు పంపిణీ చేశారు. ప్రతి సోమవారం స్వామివారికి విశేషపూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బెస్త కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



మంత్రిని కలిసిన మడితం రమణ

మదనపల్లె అర్బన్, జూన్30 (ఆంధ్రజ్యోతి): బెస్త సంక్షేమ సంఘానికి రాష్ట్రంలో కార్పొరేషన్ ఏర్పాటు చేసి బెస్తలను అభివృద్ధి చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు మంత్రి కొల్లు రవీంద్రను కలిసి విన్నవించారు. విజయవాడలోని భారతీనగర్‌లో మంత్రిని కలిసి మత్స్యకారులు స్థితిగతులను, వారు పడుతు న్న ఇబ్బందులను వివరించారు. కార్పొరేషన్ ఏర్పాటును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఇప్పటికే రాష్ట్రంలో బెస్తలు వెనకబడి ఉన్నారని వారి సంక్షేమానికి నిధులు కేటాయించాలని కోరారు. ప్రభుత్వం రుణాల రూపంలో సాయం చేసి వారిని ఆదుకోవాలన్నారు.

పట్టణంలో అక్రమాలను అరికడతాం

మదనపల్లె అర్బన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అక్రమాలను అరికట్టతామని తహసీల్దార్ కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. రైతుల నుంచి వినతులను స్వీకరించి రెవెన్యూ అధికారులతో సమీక్షించిన ఆయన మాట్లాడుతూ అనధికారికంగా ఇంటి స్థలాలు అక్రమించి నిర్మాణాలు చేపటితే చర్యలు తీసుకుంటామన్నారు. తమ దృష్టికి వచ్చిన వాటిపై సర్వే నిర్వహించి అక్రమాలని తేలితే తొలగిస్తామన్నారు. ఆర్ఐ బాలసుబ్రహ్మణ్యం, సర్వేయర్ సుబ్రహ్మణ్యం, వీఆర్వోలు శివశంకర, నారాయణ, సుజాత, సౌజన్య, నాగేశ్వర, చంద్రయ్య పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



డెంగ్యూ జ్వరాలపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

తంబళ్లపల్లె, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోసువారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి అనుపమ అన్నారు. సోమవారం తంబళ్లపల్లెలో డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాలను నిర్వహించారు. దోమల ద్వారా వ్యాప్తి చెందే జ్వరాలు, రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజల్లో అవగాహన కల్పించారు. పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు పాటిస్తూ, పారిశుధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం యాంటీ లార్వా ఆపరేషన్ చేపట్టి మురుగు నీటి కాల్వలు, నీరు నిల్వ ఉన్న చోట దోమల నివారణ మందులు పిచికారీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ క్రిష్ణానాయక్, ఏఎన్ఎం కుతీజా, ఆశ వర్కర్లు రసూల్‌బీ తదితరులు పాల్గొన్నారు.

వారపుసంతలో వినూత్న ప్రచారం

పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పాలని కరపత్రాల పంపిణీ



వారపుసంతలో ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

నిమ్మనపల్లి జూన్ 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించి వారికి మంచి భవిష్యత్తు ఇవ్వాలని స్థానిక మోడల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఉపాధ్యాయులు భాస్కరన్, సుధాకర్ వినూత్న ప్రచారం చేపట్టారు. సోమవారం వారపుసంత కావడంతో ద్విచక్రవానంలో చిన్నపాటి సౌండ్ బాక్సు ఏర్పాటు చేసి ప్రజలకు వినిపించేలా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పిస్తే మంచి భవిష్యత్ వుంటుందని తల్లికి వందనం, ఉచిత మూనిఫాం, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు ఇస్తామన్నారు. కరపత్రాలు ముద్రించి సంతకు వచ్చిన చిన్నారుల తల్లిదండ్రులకు వాటిని పంచిపెట్టి ప్రైవేటు బడులు వద్దు ప్రభుత్వ బడులే ముద్దు అని తెలియజేశారు. ఇప్పటి వరకు ఎవరూ ప్రభుత్వ పాఠశాలల గురించి ఇలాంటి ప్రచారం చేపట్టక పోవడం గమనార్హం.

సింగిల్ విండో చైర్మన్‌కు సత్కారం



చంద్రకుమార్ రెడ్డిని సన్మానిస్తున్న టీడీపీ శ్రేణులు

కలికిరి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కలికిరి సింగిల్ విండో (ప్యాక్స్) చైర్మన్‌గా ప్రభుత్వం ప్రతిపాదించిన నల్లారి చంద్రకుమార్ రెడ్డిని సోమవారం టీడీపీ శ్రేణులు సన్మానించారు. స్థానిక కార్యాలయం అమరనాథ రెడ్డి భవన్‌లో వివిధ అనుబంధ విభాగాల తరపున శాలువాలు కప్పి పుష్ప గుచ్ఛాలు అందజేశారు. కార్యక్రమంలో కలికిరి మాజీ సర్పంచ్ నల్లారి లక్ష్మీకర్ రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు నిజాముద్దీన్, మాజీ ఎంపీపీ నాగభూషణ రెడ్డి, రెడ్డెప్ప రెడ్డి, దినకర్, పెద్దచంద్ర, జ్ఞానమూర్తి, యల్లయ్య, వైజాగ్ బాషా, రాజా రెడ్డి, రమణ, చంద్రశేఖర్, మురళి, రామోజీ, జాఫర్ హజరత్, కరీముల్లా, మౌలానా, అలీ హజరత్ తదితరులు పాల్గొన్నారు.

మల్లయ్యకొండకు పోటెత్తిన భక్తులు

తంబళ్లపల్లె, జూన్ 30(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లెకు సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మల్లయ్యకొండ సోమవారం భక్తులతో కిటకిటలాడింది. రాయలసీమ జిల్లాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు కుటుంబ సమేతంగా మల్లయ్యకొండకు వచ్చి శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. పూజారి ఈశ్వరయ్య స్వామి వారిని నాగభరణంతో ప్రత్యేకంగా అలంకరించి దూప,దీప నైవేద్యాలతో పంచామృతాభిషేకాలు నిర్వహించారు. భక్తుల పేరిట అర్చనలు, అభిషేకాలు నిర్వహించి స్వామి వారి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఆలయ ఈవో మునిరాజ ఆధ్వర్యంలో కొండ పైన భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు.

సంపాదనలో సేవకు కేటాయించండి

వెలుగు అనాథాశ్రమంలో అన్నదానం

మదనపల్లె టౌన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): తాము సంపాదించే సొమ్ములో కనీసం ఐదు శాతం సేవకు కేటాయించాలని కురవంక సర్పంచ్ చిప్పిలి చలపతి పిలుపునిచ్చారు. సర్పంచ్ కుమారుడు శశికుమార్ పుట్టిన రోజు పురస్కరించుకుని అమ్మచెరువుమిట్ట వద్ద వున్న వెలుగు అనాథాశ్రమం, వృద్ధాశ్రమం, దివ్యాంగుల ఆశ్రమంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వెలుగు కార్యదర్శి ఉదయమోహన్‌రెడ్డి, పునీత్, చిరంజీవి, హరికృష్ణ, వినయ్, వెంకటేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.